

RNI NO: APTEL/25/A4894

ఉషశ్రీ

USHASRI తెలుగు దినపత్రిక

RNI NO: APTEL/25/A4894
ఉషశ్రీ USHASRI తెలుగు దినపత్రిక
సమస్యలతో ఒంటరిగా పోరాడకండి.
సమాచారం - సహకారం -
పరిస్కారం ఒకే చోట సంప్రదించండి
9295003377

సంపుటి : 01 | సంచిక : 68 | విజయవాడ | ఎడిటర్ : ఇలిపిళ్ల మోహన్ | మంగళవారం 19 - 05 - 2026 | పేజీలు : 08 | వెల : రూ.2/-

Published From : Visakhapatnam Vijayawada Guntur Tirupati Kurnool Nellore Rajahmundry Kakinada Anantapur Kadapa Eluru Ongole Srikakulam Vizianagaram Machilipatnam Chittoor

40 వేల మందితో టెలీ కాన్ఫరెన్స్

సంక్షేమం, అభివృద్ధి, సుపరి పాలనే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టీకరణ.....

అవినీతి రహిత పారదర్శక పాలన అందించాలని అధికారులకు ఆదేశం..

ప్రజల అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచన

వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని దిశానిర్దేశం....

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

సుపరిపాలన, సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఒకే బృందంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సోమవారం అమరావతిలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సుమారు 40 వేల మంది ఉద్యోగులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొనగా, ప్రభుత్వ ప్రాధాన్యతలను, పనితీరును సీఎం వారికి వివరించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి ఉద్యోగులు నేరుగా ముఖ్యమంత్రితో మాట్లాడే అవకాశం కల్పించారు. కాకినాడ జిల్లాకు చెందిన ఓ ఉద్యోగి గృహ నిర్మాణ పథకంపై కొన్ని విలువైన సూచనలు చేయగా, సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు.

మిగతాది 2 లో...

ముందస్తు ప్రయోగం

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2029 గెలుపుపై దృష్టి

- ఎన్నికలు వైసీపీకి జీవన్మరణంగా మారే పరిస్థితి
- 175లో 90 సీట్లకు ముందస్తు అభ్యర్థుల ఆలోచన
- ముందుగానే పని చేయాలనే బాధ్యత అభ్యర్థులపై
- సీనియర్లకు టికెట్లు ఖరారు చేసే ప్లాన్
- ముందస్తు ప్రకటనతో పార్టీ ఉత్సాహం పెంపు

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 2029 ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి తీరాలని చూస్తున్నారు. ఒక విధంగా చూస్తే పార్టీకి ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా మారనున్నాయని అంటున్నారు. ఈ ఎన్నికల్లో కూడా వైసీపీ ఓటమి పాలు అయితే 2034 వరకూ పార్టీ నిలిచి గెలిచే అవకాశాలు ఏమేరకు ఉంటాయన్న చర్చ ఉండనే ఉంది. అందుకే ఈసారి గెలుపు గుర్రాన్ని ఆరు నూరు అయినా ఎక్కాల్సిందే అన్నది వైసీపీ అధినేత పట్టుదలగా ఉంది. దాని కోసం ఆయన అనేక వ్యూహాలతో సిద్ధంగా ఉన్నారు. దానిలో ఒకటిగా ముందస్తు ప్రయోగం చేయడానికి చూస్తున్నారు అని అంటున్నారు. ఇది ప్రచారంలోకి వచ్చిన విషయంగా కూడా ఉంది.

సగానికి పైగా సీట్లలో : ఏపీలో మొత్తం 175 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. ఇందులో సగానికి పైగా సీట్లలో

కేరళలో యూడీఎఫ్ ప్రభుత్వం

- కేరళ నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ నేత వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం
- పదేళ్ల విరామం తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన యూడీఎఫ్ కూటమి
- రాజకీయ ప్రత్యర్థిగా భావించే రమేశ్ చెన్నితాలకు హోం శాఖ కేటాయించిన సీఎం
- తిరువనంతపురంలో జరిగిన కార్యక్రమానికి రాహుల్ గాంధీ, ఖర్గే హాజరు

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

కేరళలో పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికార పగ్గాలు చేపట్టింది. నేడు తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ ఆర్లేకర్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సతీశన్‌తో పాటు మరో 20 మంది ఎమ్మెల్యేలు కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు. కొత్త మంత్రివర్గంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు రమేశ్ చెన్నితాల, కే. మురళీధరన్, ఏపీ అనిల్ కుమార్‌లకు స్థానం లభించింది. అలాగే, కేపీసీసీ చీఫ్ సన్నీ జోసెఫ్ కూడా కేబినెట్‌లో చేరారు. మిత్రపక్షాల నుంచి ఐయూఎంఎల్ సీనియర్ నేత పీకే కున్హాలికుట్టి, ఆర్ఎస్పీ నేత షిబు బేబీ జాన్, కేరళ కాంగ్రెస్ నేత మోన్స్ జోసెఫ్, కేరళ కాంగ్రెస్ (జాకబ్) నేత అనూప్ జాకబ్ వంటి

మిగతాది 2 లో...

'ఇక మీ అంతు చూస్తాం'

- ఏఐ చిత్రాలతో మిస్సైల్ దాడులు, అంతరిక్ష యుద్ధం దృశ్యాల ప్రదర్శన
- వేగంగా స్పందించకపోతే ఇరాన్ ఉనికి ఉండదని తీవ్ర హెచ్చరిక
- ఫిబ్రవరి నుంచి కొనసాగుతున్న యుద్ధంలో ప్రతిష్టంభన

2

అంతర్జాతీయం, ఉష శ్రీ

అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధ ప్రతిష్టంభన కొనసాగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన దూకుడును సోషల్ మీడియా వేదికగా ప్రదర్శించారు. తన 'ట్రూత్ సోషల్' ప్లాట్‌ఫామ్‌లో ఇరాన్‌ను హెచ్చరిస్తూ, రెచ్చగొట్టేలా ఉన్న ఏఐ చిత్రాలను వరసగా పోస్ట్ చేశారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలను ఈ పోస్టులు మరింత పెంచాయి. కొన్ని గంటల వ్యవధిలోనే ట్రంప్ 20కి పైగా చిత్రాలను పంచుకున్నారు. వీటిలో చాలా వరకు ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యను తీవ్రతరం చేస్తున్నట్లుగా ఉన్నాయి. ఇరాన్ పటాన్ని అమెరికా జెండాతో కప్పి, చుట్టూ బాణాలు గురిపెట్టినట్లు ఉన్న ఒక చిత్రం తీవ్ర

టీడీపీలో షాడోల రాజ్యం ?

పూసపాటి కుటుంబం మూడు తరాల పాలన కొనసాగింపు
అదితి గజపతిరాజు 2024లో గెలిచి ఎమ్మెల్యేగా స్థిరీకరణ
షాడో నేతల ప్రభావంపై పార్టీలో గుసగుసలు
అశోక్ గజపతిరాజుతో పోలిస్తే భిన్నమైన పాలన తీరు

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం అంటే గుర్తుకు వచ్చేది పూసపాటి వారి కుటుంబమే. మూడు తరాలుగా వారు ఎమ్మెల్యేలుగా ఈ ప్రాంతాన్ని పాలిస్తున్నారు. పీవీజీ రాజుతో మొదలైన వారి ప్రజా ప్రాతినిధ్యం ఆయన మనవరాలు అదితి గజపతిరాజు దాకా కొనసాగుతోంది. మధ్యలో అశోక్ గజపతి రాజు ఏడు సార్లు గెలిచి అనేక మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. ఇపుడు ఆయన గోవా గవర్నర్ గా రాజ్యాంగ బద్ధ బాధ్యలతో బిజీగా ఉన్నారు.

నమ్మకమైన భాగస్వామిగా నిలుపుతాం

- ఢిల్లీలో 'యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా" సదస్సు
- హాజరైన ఏపీ మంత్రి నారా లోకేష్
- పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యం
- విశాఖను ఏఐ, డేటా సెంటర్ల హబ్‌గా అభివృద్ధి చేసే ప్రణాళిక
- డేటా సెంటర్ల చుట్టూ పూర్తిస్థాయి తయారీ ఎకోసిస్టమ్ నిర్మాణం

'ఇక మీ అంతు చూస్తాం'

చర్చనీయాంశమైంది. ఇరాన్ ఫాస్ట్ బోట్లపై అమెరికా డ్రోన్ దాడి చేస్తున్న చిత్రం కింద "బై బై, ఫాస్ట్ బోట్స్" అని రాశారు. అంతేగాక తాను ఒక కంప్యూటర్ ముందు కూర్చుని టేబుల్‌పై చేతితో నొక్కుతూ, "బా బా బా బా... ఫైర్, బూమ్" అంటూ క్షిపణి దాడికి ఆదేశాలిస్తున్నట్లు నటించిన ఒక వీడియోను కూడా పంచుకున్నారు. అంతరిక్షం నుంచి క్షిపణి దాడులను పర్యవేక్షిస్తున్నట్లు, స్పేస్‌క్రాఫ్ట్‌లో 'కిల్ బటన్' నొక్కుతున్నట్లు ఉన్న చిత్రాలు కూడా ఈ పోస్టులలో ఉన్నాయి. ఈ చిత్రాల వెల్లువకు ముందు ట్రంప్ ఇరాన్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చారు. "ఇరాన్‌కు సమయం మించిపోతోంది. వాళ్లు వేగంగా శాంతి ఒప్పందం వైపు రాకపోతే, వారి ఉనికి కూడా ఉండదు. సమయం చాలా కీలకం!" అని తన ట్రూత్ సోషల్ ఖాతాలో రాసుకొచ్చారు. గత ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఇరాన్‌పై భారీ దాడులు ప్రారంభించినప్పటి నుంచి ఇరు దేశాల మధ్య యుద్ధం కొనసాగుతోంది. పశ్చిమాసియాను అస్థిరపరిచిన ఈ యుద్ధాన్ని ముగించేందుకు వాషింగ్టన్ చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఈ యుద్ధం కారణంగా కీలకమైన హర్మూజ్ జలసంధి దిగ్బంధనంలోకి వెళ్లింది. ప్రపంచంలోని 20 శాతం చమురు ఎగుమతులు ఈ మార్గం గుండానే జరుగుతాయి. దీనివల్ల అంతర్జాతీయంగా ఇంధన ధరలు భారీగా పెరిగాయి. అయితే, లెబనాన్‌లో శాశ్వత కాల్పుల విరమణ జరిగే వరకు ట్రంప్‌తో ఎలాంటి శాంతి ఒప్పందం కుదుర్చుకోబోమని ఇరాన్ స్పష్టం చేసింది. తన షరతులకు టెహ్రాన్ అంగీకరించకపోవడంతో ట్రంప్ తీవ్ర అసహనంతో ఉన్నారని, ఈ నేపథ్యంలోనే సోషల్ మీడియా ద్వారా ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తున్నారని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

నమ్మకమైన భాగస్వామిగా నిలుపుతాం

ఆంధ్రప్రదేశ్: భవిష్యత్ అణు ఇంధన (న్యూక్లియర్ ఎనర్జీ) ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్‌ను నమ్మకమైన ప్రపంచ భాగస్వామిగా నిలబెట్టడమే తమ ధ్యేయమని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ప్రపంచ న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశలోకి ప్రవేశిస్తున్న తరుణంలో ఇది అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. న్యూఢిల్లీలో న్యూక్లియర్ ఎనర్జీ ఇనిస్టిట్యూట్ (ఎన్ఈఐ), యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరం (యూఎస్ఐఎస్ పీఎఫ్) సంయుక్తంగా నిర్వహించిన "యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా" సదస్సులో లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఆంధ్రప్రదేశ్‌లో సహజసిద్ధ ప్రయోజనాలు: ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, "ఆధునిక న్యూక్లియర్ సాంకేతికతలైన స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, తదుపరి తరం రియాక్టర్ సిస్టమ్స్‌కు విస్తృత అవకాశాలున్నాయి. భారత్‌లో ఇంజనీరింగ్ ప్రతిభ, తయారీ రంగంలో నైపుణ్యం, తక్కువ ఖర్చుతో కూడిన ఉత్పత్తి వంటివి కలిసొచ్చే అంశాలు. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు పారిశ్రామిక మౌలిక వసతులు, పోర్టులు, లాజిస్టిక్స్, వేగవంతమైన అమలు సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఇది భారతదేశానికి, ఏపీకి ఒక చరిత్రాత్మక అవకాశం" అని వివరించారు. రాష్ట్రానికి ఉన్న సువిశాల తీరప్రాంతం, శక్తివంతమైన పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పారిశ్రామిక కారిడార్లు, ప్రతిష్టాత్మక పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ఎకోసిస్టమ్ వంటివి అదనపు ప్రయోజనాలని తెలిపారు. పారిశ్రామికీకరణలో వేగం, అమలు అత్యంత ముఖ్యమని, ఇందులో న్యూక్లియర్ ఎకోసిస్టమ్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు.

ఎనర్జీ సెక్యూరిటీ మాకు అత్యంత కీలకం: ప్రపంచ దేశాలు ఆర్థికవృద్ధి, పారిశ్రామిక వ్యాప్తి, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, కర్బన ఉద్గారాల తగ్గింపు వంటివి ఏకకాలంలో ఎలా సాధించాలని ఆలోచిస్తున్నాయని లోకేష్ అన్నారు. వాతావరణ మార్పులపై ఇచ్చిన హామీలను పాటిస్తూ, ఏఐ యుగానికి అవసరమైన విద్యుత్‌ను తక్కువ ఖర్చుతో, సురక్షితంగా ఎలా అందించాలన్నది పెద్ద సవాల్ అని పేర్కొన్నారు. "ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఆకాంక్షలు విస్తృతంగా ఉన్న నేపథ్యంలో ఇంధన భద్రత (ఎనర్జీ సెక్యూరిటీ) మాకు అత్యంత ప్రాధాన్య అంశం. నేడు ఏపీ దేశంలోనే కీలకమైన పారిశ్రామిక, డిజిటల్ కేంద్రంగా మారుతోంది," అని లోకేష్ స్పష్టం చేశారు.

ఇంధన పరివర్తనపై ఆంధ్రప్రదేశ్ దృష్టి: రాష్ట్రంలో కొత్త పారిశ్రామిక కారిడార్లను నిర్మిస్తున్నామని, ఎలక్ట్రానిక్స్ తయారీ సామర్థ్యాన్ని పెంచుతున్నామని లోకేష్ తెలిపారు. విశాఖపట్నాన్ని ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామని, అక్కడ 6 గిగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లు రాబోతున్నాయని వెల్లడించారు. భవిష్యత్ పరిశ్రమలకు భారీ పరిమాణంలో, 24/7 నిరంతరాయంగా, కాలుష్యరహిత, తక్కువ ఖర్చుతో కూడిన విద్యుత్ అవసరమని, అందుకే ఇంధన ప్రణాళిక ఆర్థిక ప్రణాళికలో కీలకంగా మారిందని వివరించారు. "మా ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా రెన్యూవబుల్స్, స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్‌మిషన్, గ్రిడ్ ఆధునీకరణ వంటి రంగాల్లో సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను లక్ష్యంగా పెట్టుకున్నాం," అని ఆయన ప్రకటించారు.

భవిష్యత్తులో భారీగా విద్యుత్ అవసరం: భవిష్యత్ పారిశ్రామిక వృద్ధికి కేవలం పునరుత్పాదక శక్తి సరిపోదని తాము వాస్తవికంగా ఆలోచిస్తున్నామని లోకేష్ అన్నారు. ఏఐ కంప్యూటింగ్ విస్తరిస్తున్న కొద్దీ విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరుగుతోందని, ఒక హైపర్‌స్కేల్ ఏఐ-నేటివ్ డేటా సెంటర్ ఒక మధ్యస్థ పట్టణానికి సమానమైన విద్యుత్‌ను వినియోగిస్తుందని ఉదహరించారు. గ్లోబల్ కంపెనీలు విశాఖలో గిగావాట్ సామర్థ్యంగల ఏఐ-నేటివ్ డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకొస్తున్నాయని, వీటికి భారీ విద్యుత్ అవసరమవుతుందని తెలిపారు.

డేటాసెంటర్ల చుట్టూ తయారీ ఎకోసిస్టమ్: తమ దృష్టిలో డేటా సెంటర్ అంటే కేవలం సర్వర్లతో కూడిన భవనాలకు ఆతిథ్యమివ్వడం కాదని, దాని చుట్టూ ఒక పూర్తిస్థాయి తయారీ ఎకోసిస్టమ్‌ను నిర్మించడమే తమ లక్ష్యమని లోకేష్ స్పష్టం చేశారు. కూలింగ్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, బ్యాటరీ స్టోరేజ్ వంటి వాటిని స్థానికంగా తయారు చేయడాన్ని ప్రోత్సహిస్తామని తెలిపారు. ఏఐ టెక్నీషియన్లు, ఎనర్జీ ఇంజనీర్ల కోసం ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి సంస్థలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

న్యూక్లియర్ ఎనర్జీ సప్లయ్ చైన్‌లో భాగస్వామ్యం: న్యూక్లియర్ ఎనర్జీని కూడా ఒక పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థగా చూడాలని లోకేష్ అభిప్రాయపడ్డారు. కేవలం విద్యుత్ ఉత్పత్తికే పరిమితం కాకుండా, పూర్తి న్యూక్లియర్ వాల్యూ చైన్‌లో భాగస్వామ్యం కావడమే ఏపీకి దీర్ఘకాలిక అవకాశమని అన్నారు. కీలక విడిభాగాలు తయారు చేయడం, అత్యాధునిక ఇంజనీరింగ్ సామర్థ్యాలు నిర్మించడం, ప్రపంచస్థాయి భద్రతా ప్రమాణాలు నెలకొల్పడం, భవిష్యత్ వర్క్‌ఫోర్స్‌కు శిక్షణ ఇవ్వడం వంటి వాటిపై దృష్టి సారిస్తామని వెల్లడించారు.

ఎకో సిస్టమ్ నిర్మాణానికి సరైన సమయం: న్యూక్లియర్ ప్రాజెక్టులకు బదులుగా న్యూక్లియర్ పారిశ్రామిక ఎకోసిస్టమ్‌లను నిర్మించడానికి ఇదే సరైన సమయమని లోకేష్ పేర్కొన్నారు. అణుశక్తి విశ్వసనీయ బేస్‌లోడ్ విద్యుత్‌ను అందిస్తుందని, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని, దీర్ఘకాలంలో పోటీ ధరలకు విద్యుత్‌ను అందిస్తుందని వివరించారు. ఆధునిక న్యూక్లియర్ టెక్నాలజీల వల్ల భద్రతా ప్రమాణాలు కూడా గణనీయంగా మెరుగుపడ్డాయని గుర్తుచేశారు.

ఇంధన భవిష్యత్ పైనే ఏఐ భవిష్యత్: ఏఐ విప్లవం వల్ల ఇంధనానికి డిమాండ్ పెరిగిందని, దీనివల్ల న్యూక్లియర్ ఎనర్జీ ప్రాముఖ్యతను ప్రపంచ దేశాలు గుర్తిస్తున్నాయని లోకేష్ అన్నారు. "ఏఐ భవిష్యత్తు ఇంధన భవిష్యత్తుపై ఆధారపడి ఉంటుంది. భవిష్యత్తులో నమ్మకమైన, స్వచ్ఛమైన బేస్‌లోడ్ విద్యుత్ తప్పనిసరి. ఇది ప్రభుత్వాలు, టెక్నాలజీ ప్రొవైడర్లు, పెట్టుబడిదారుల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాలకు అపారమైన అవకాశాలు సృష్టిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ఆ భవిష్యత్తులో భాగస్వామ్యం కావాలని కోరుకుంటోంది," అని ఆయన తెలిపారు.

యూఎస్-ఇండియా న్యూక్లియర్ అధ్యాయం: భారత్-అమెరికా సహకారం ఇప్పటికే టెక్నాలజీ, రక్షణ, సెమీకండక్టర్లు వంటి రంగాల్లో మార్పులు తెచ్చిందని, ఈ వ్యూహాత్మక భాగస్వామ్యంలో తదుపరి ప్రధాన అధ్యాయం అణుశక్తి రంగమే కాగలదని లోకేష్ బలమైన విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఇంధన భాగస్వామ్యంగా కాకుండా, పారిశ్రామిక, తయారీ, ఆవిష్కరణల భాగస్వామ్యంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం పటిష్ఠమైన ఇంధన, పారిశ్రామిక పునాదులు నిర్మిస్తున్నామని, దీర్ఘకాలిక దార్శనికత కలిగిన గ్లోబల్ భాగస్వాములతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి లోకేష్ తన ప్రసంగాన్ని ముగించారు.

కేరళలో యూడీఎఫ్ ప్రభుత్వం

ప్రముఖులు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ వేడుకకు వేలాది మంది యూడీఎఫ్ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి తమ ఆనందాన్ని పంచుకున్నారు.

రాజకీయ ప్రత్యర్థికి హోం శాఖ.. సతీశన్ సంచలనం: కేరళ రాజకీయాల్లో ఓ అరుదైన పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి వీడీ సతీశన్, అత్యంత కీలకమైన హోం శాఖను తన వద్ద ఉంచుకోకుండా పార్టీలోని తన రాజకీయ ప్రత్యర్థిగా పేరున్న సీనియర్ నేత రమేశ్ చెన్నితాలకు కేటాయించారు. ఇది పార్టీలో అంతర్గత విభేదాలకు ముగింపు పలికి, సమన్వయంతో ముందుకు సాగాలనే సంకేతాలను ఇస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నిర్ణయాన్ని చెన్నితాల ధ్రువీకరించారు. "పదేళ్ల తర్వాత యూడీఎఫ్ అధికారంలోకి వచ్చిన ఈ రోజు కేరళ ప్రజలకు శుభదినం. ప్రజలకు సుపరిపాలన అందించడం మా కర్తవ్యం. నేను హోం శాఖ బాధ్యతలు చేపట్టబోతున్నాను" అని ఆయన తెలిపారు.

స్పష్టమైన ఆధిక్యంతో యూడీఎఫ్ విజయం: ఈ నెల 4న వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో యూడీఎఫ్ కూటమి అద్భుత విజయం సాధించింది. మొత్తం 140 అసెంబ్లీ స్థానాలకు గాను యూడీఎఫ్ 106 సీట్లు గెలుచుకుంది. ఇందులో కాంగ్రెస్ పార్టీకి 63, దాని ప్రధాన మిత్రపక్షానికి 22 సీట్లు దక్కాయి. మరోవైపు, అధికారంలో ఉన్న వామపక్ష కూటమి లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) కేవలం 35 స్థానాలకే పరిమితమై ఘోర పరాజయం చవిచూసింది. సీపీఎం 26, సీపీఐ 8 సీట్లు మాత్రమే గెలుచుకున్నాయి. దేశంలో వామపక్షాలు అధికారంలో ఉన్న చివరి రాష్ట్రమైన కేరళలో కూడా అధికారం కోల్పోవడం గమనార్హం.

జగన్ ముందస్తు ప్రయోగం

ముందస్తుగా అభ్యర్థులను ప్రకటినాలని జగన్ ఆలోచిస్తున్నారు అన్నది ప్రచారంలో ఉన్న మాట. అంటే 90 దాకా సీట్లలో అభ్యర్థులను మూడేళ్లకు ముందే ప్రకటిస్తారు అన్న మాట. ఆ విధంగా చేయడం ద్వారా ఆయా నియోజకవర్గాలలో ఇప్పటి నుంచే వారు కట్టుబడి కష్టపడి పనిచేస్తారు అని గ్రాస్ రూట్ లెవెల్ నుంచి నియోజకవర్గం వరకూ ఖర్చులు వ్యయ ప్రయాసలు సాధక బాధలు వారే పడతారు అని వైసీపీ అధినాయకత్వం భావిస్తోంది. పార్టీని వారు ఒక విధంగా మరింతగా సొంతం చేసుకుంటారని వారిలో తమకే సీటు ఇచ్చారు కాబట్టి గెలిచి రావాలన్న పట్టుదల కనిపిస్తుందని కూడా అంటున్నారు. అందుకే ఎంపిక చేసిన నియోజకవర్గాలలో ముందస్తుగా అభ్యర్థుల ప్రకటన ఉంటుందని అంటున్నారు.

వీరికి టికెట్ కచ్చితమే : ఏ పార్టీలో అయినా పాతిక శాతం టికెట్లూ ఎపుడూ కొందరు సీనియర్లకు కచ్చితంగా ఇస్తారు. అలా వైసీపీలో కూడా సీనియర్ నేతలు మాజీ మంత్రులకు టికెట్లు ఎటూ ఖరారు చేస్తారు. అది అఫీషియల్ గా ప్రకటిస్తే వారితో పాటు క్యాడర్ లోనూ కొత్త ఉత్సాహం వస్తుందని ఫలితంగా వారంతా ముందుకు వచ్చి పని చేస్తారని హైకమాండ్ ఊహిస్తోంది అంటున్నారు. వీరితో పాటు మరో పాతిక శాతం మందిని బలం అధారంగా సామాజిక వర్గ సమీకరణలు ఇతర లెక్కలు చూసుకుని ఎంపిక చేస్తే సగానికి సగం ఏపీలో ముందస్తుగా వైసీపీ అభ్యర్థులను ప్రకటించినట్లు అవుతుందని భావిస్తున్నారు. ఇలా చేయడం వల్ల ఎన్నికల మూడ్ ముందే వస్తుందని పార్టీ కూడా రీ యాక్టివ్ అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ విధంగా సగం రాష్ట్రంలో వైసీపీ జోరు అందుకుంటే ఆ ప్రభావం మిగిలిన చోట్ల కూడా కనిపించి టోటల్ గా ఫ్యాన్ స్పీడ్ యమ రేంజిలో పెరిగిపోతుందని కూడా భావిస్తున్నారు.

మైనస్ పాయింట్లు ఇవే : అయితే ముందుగా వైసీపీ అభ్యర్థులను ప్రకటించడం వల్ల ఇబ్బందులు కూడా ఉన్నాయని అంటున్నారు. అది కూడా మూడేళ్ళకు ముందే ప్రకటించడం వల్ల ఆయా చోట్ల కూటమికి చాన్స్ ఇచ్చినట్లు అవుతుందని అంటున్నారు. వారు వీరిని మించిన వారిని బలవంతులను రంగంలోకి దింపితే అపుడు వైసీపీకి ఇబ్బంది అవుతుందని కూడా అంటున్నారు. అంతే కాదు వైసీపీ అభ్యర్థులను చూసి అన్ని విధాలుగా మెరుగైన అభ్యర్థులను కూటమి పార్టీలు సెలెక్ట్ చేసుకోవడానికి ఒక గోల్డెన్ చాన్స్ గా ఇది ఉపయోగపడుతుందని అంటున్నారు. మరో వైపు చూస్తే సొంత పార్టీలోనే ఈ నిర్ణయం వల్ల చాలా మంది ఆశావహులు డీలా పడిపోవచ్చు అని వారు మూడేళ్ళకు ముందే వైసీపీని వీడి ఇతర పార్టీలలో చేరేందుకు యత్నించవచ్చు అని అది వైసీపీకి బూమరాంగ్ అవుతుందని కూడా అంటున్నారు. అయితే ఈ ముందస్తు ప్రయోగం మీద వైసీపీలో అయితే ఇంకా తర్జన భర్జన పడుతున్నరు కానీ నిర్ణయానికి రాలేదని అంటున్నారు. చూడాలి మరి ఈ ప్రచారం ఏ విధంగా ముందుకు సాగుతుందో.

టీడీపీలో షాడోల రాజ్యం ?

ఆయన కుమార్తెగా వారసురాలిగా 2019లో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన అదితి గజపతి రాజు ఆ ఎన్నికల్లో ఓటమి పాలు అయినా 2024 లో గెలిచి తన సత్తా చాటుకున్నారు.

అదే బలమైన విమర్శ : ఇక గెలిచిన తరువాత ఎమ్మెల్యే పెద్దగా జనంలోకి రారు అన్న విమర్శలు అయితే వినిపిస్తున్నాయి. నిత్యం ప్రజలతో మమేకం కావాలని పార్టీ ఆదేశాలు ఒక వైపు ఉంటే ఎమ్మెల్యే మాత్రం తనదైన శైలిలో రాజకీయం చేస్తున్నారు అని అంటున్నారు. ఆమెకు పార్టీలో ఇద్దరు కీలక నేతలు షాడోలుగా మారారని అంటున్నారు. జనంలో ఏ మాత్రం పలుకుబడి లేని ఈ ఇద్దరు నాయకులలో ఒకరు వైసీపీ నుంచి వచ్చి టీడీపీలో చేరిన వారు అయితే మరొకరు సెటిల్మెంట్స్ చేస్తూ ఏకంగా ఎమ్మెల్యే దగ్గర తన పలుకుబడి పెంచుకుని అతి ముఖ్య సలహాదరుగా మారిపోయారని అంటున్నారు . ఇపుడు సీన్ ఎలా ఉంది అంటే ఈ ఇద్దరి సలహా సంప్రదింపులు లేకుండా ఎమ్మెల్యే కనీసం ఏదీ వినే పరిస్థితి లేదని సొంత పార్టీలోనే గుసగుసలు పోతున్నారు. ఇదే ఇపుడు ప్రచారంలో కూడా ఉంది.

అంతా వారే అంటూ : పర్యవసానంగా అంతా వారే అన్నట్లుగా పరిస్థితి మారింది. వారు ఏమి చెబితే అదే జరుగుతోందని ఒక విధంగా షాడో ఎమ్మెల్యేలుగా వారు మారిపోయారని అంటున్నారు. ఇక ప్రతీ విషయం వారు కనుసన్నలలోనే సాగుతోందని వారికి తెలియకుండా ఎమ్మెల్యే కూడా ఏమీ చేయడం లేదని అంటున్నారు. దీతో ఉద్యోగుల బదిలీల నుంచి కాంట్రాక్టుల కేటాయింపులు అధికారిక వ్యవహారాలు అన్నీ కూడా ఈ ఇద్దరే చక్కదిద్దుతున్నారని అంటున్నారు. వీరి వల్ల మేలు జరగకపోగా పార్టీకి చెడ్డ పేరు వస్తోందని ప్రభుత్వానికి ఇబ్బందిగా ఉందని అంటున్నారు.

పెద్దాయనకు భిన్నం : ఇక అశోక్ గజపతి రాజు అయితే అను నిత్యం కార్యకర్తలతో మమేకం అయ్యేవారు. ఆయనకు క్షేత్ర స్థాయిలో జరిగే ప్రతీ విషయం మీద అవగాహన ఉండేదని అంటున్నారు. అందుకే ఆయన సుదీర్ఘ కాలం ఎమ్మెల్యేగా గెలిచి జనం గుండెలలో నిలిచారు అని అంటున్నారు. దానికి భిన్నంగా వారసురాలి పాలన సాగుతోంది అని అంటున్నారు. ఎంతసేపూ షాడోల మీద ఆధారపడడం వల్ల సమస్యలు వస్తున్నాయని అంటున్నారు. తాజాగా చూస్తే విజయనగరం కార్పోరేషన్ లో ఏకంగా 28 మంది అధికారులను ఒక్కసారిగా బదిలీ చేయడం సంచలనం అయింది. దీని వెనక షాడోల ప్రమేయం ఉందని అంటున్నారు. ఈ తరహా పరిణామాలు పార్టీలో మొదటి నుంచి ఉంటూ వస్తున్న సీనియర్ నేతలకు ఏ మాత్రం జీర్ణించుకోలేనివి గా ఉన్నాయని చెబుతున్నారు. మరి ఎమ్మెల్యే తీరు మార్చుకుని షాడోల పాలనకు చెక్ పెట్టకపోతే రానున్న రోజులలో పర్యవసనాలు కూడా వేరేగా ఉండొచ్చు అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో. ఈ ప్రచారంలో ఏ మేరకు నిజం ఉందో.

40 వేల మందితో టెలీ కాన్ఫరెన్స్

"మీరు మంచి సూచన చేశారు, తప్పకుండా అమలు చేస్తాం" అని ఆ ఉద్యోగికి హామీ ఇచ్చారు. సీఎంతో మాట్లాడే అవకాశం లభించడంపై పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సేవలపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సంతృప్తికర సేవలు అందించడంలో నెల్లూరు, తూర్పుగోదావరి, పల్నాడు జిల్లాల కలెక్టర్లు తొలి మూడు స్థానాల్లో నిలిచారని సీఎం అభినందించారు. "విధ్వంసమైన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడుతున్నాం. అందరి సమష్టి కృషితోనే మనకు 'బెస్ట్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు దక్కింది. ప్రభుత్వ యంత్రాంగంలోని ప్రతీ ఒక్కరి సహకారంతో వ్యవస్థలు మెరుగుపడ్డాయి" అని చంద్రబాబు అన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా పది సూత్రాలను అమలు చేస్తున్నామని తెలిపారు. గడిచిన 23 నెలల్లో రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని, తద్వారా 24 లక్షల ఉద్యోగాలకు అవకాశాలు వచ్చాయని వివరించారు. గూగుల్, ఆర్సెలర్ మిట్టల్, ఆమ్మా (ఏఎంసీఏ) వంటి కీలక ప్రాజెక్టులు రాష్ట్రానికి వచ్చాయని, త్వరలోనే బీపీసీఎల్ వంటి మరో భారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. ఆమ్మా ప్రాజెక్టుతో పుట్టపర్తి-బెంగళూరు మధ్య ఏరో స్పేస్ సిటీగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆర్థికేతర సమస్యలను 100 శాతం పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. "ప్రభుత్వ పాలనలో వేగం పెరగాలి. ఆమ్మా ప్రాజెక్టుకు కేవలం 36 రోజుల్లోనే అనుమతులు ఇచ్చి శంకుస్థాపన చేశాం. ఈ వేగం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పాలనలో ఎక్కడా అవినీతి కనిపించకూడదు, పూర్తి పారదర్శకతతో పనిచేయాలి. ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం కలిగేలా మన పనితీరే బ్రాండ్‌గా మారాలి" అని చంద్రబాబు స్పష్టం చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, చిన్న సమస్య అయినా వెంటనే స్పందించి పరిష్కరించాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి . మున్సిపల్ వర్కర్స్ యూనియన్.

గిద్దలూరు, ఉషశ్రీ. గిద్దలూరు మున్సిపల్ కార్యాలయం దగ్గర ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఆధ్వర్యంలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని ధర్నా నిర్వహించారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వి బాబు, పి పాపయ్య మాట్లాడుతూ ఇప్పటికే పెరిగిన ధరలతో సామాన్య ప్రజలపై, ముఖ్యంగా కార్మిక వర్గంపై తీవ్ర భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులను క్రమబద్ధీకరించాలని పదే పదే చెప్తున్నా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెట్టి ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకోవడం దారుణమని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు పి రవి, వి ఏసుబాబు, పి కన్నయ్య, శోభ తదితరులు పాల్గొన్నారు

అంతర్జాతీయ పెట్టుబడులు ఆకర్షించే దిశగా ప్రభుత్వం అడుగులు

న్యూఢిల్లీ, ఉషశ్రీ : ఆంధ్రప్రదేశ్‌ను న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో నమ్మకమైన గ్లోబల్ భాగస్వామిగా నిలబెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని రాజ్యసభ సభ్యులు సాన సతీష్ బాబు పేర్కొన్నారు. నూక్లియర్ ఎనర్జీ ఇన్స్టిట్యూట్ , యూఎస్ – ఇండియా స్ట్రాటెజిక్ పార్టనర్షిప్ ఫోరమ్ సంయుక్తంగా నిర్వహించిన "యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా" సదస్సుకు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అతిథిగా హాజరుకావడం రాష్ట్రానికి గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ బాబు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి దిశానిర్దేశం చేస్తున్నాయన్నారు. న్యూక్లియర్ ఎనర్జీ గ్లోబల్ భాగస్వాములతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఆంధ్రప్రదేశ్‌ను న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగస్వామిగా తీర్చిదిద్దుతామని మంత్రి వెల్లడించడం ఎంతో ప్రాముఖ్యమైన అడుగని పేర్కొన్నారు.రాష్ట్రంలో సహజసిద్ధ వనరులు, పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పారిశ్రామిక కారిడార్లు, టెక్నాలజీ ఎకోసిస్టమ్ వంటి బలమైన పునాదులు ఉన్నాయని, ఇవి అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుకూలంగా ఉన్నాయని అన్నారు. రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను లక్ష్యంగా పెట్టుకోవడం ద్వారా రాష్ట్రం శక్తి రంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీస్తుందని తెలిపారు. అదే సమయంలో డేటా సెంటర్ల చుట్టూ తయారీ ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ సంకల్పం పారిశ్రామిక వృద్ధికి కొత్త అవకాశాలను తెరుస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌ను ఎనర్జీ, టెక్నాలజీ, తయారీ రంగాల్లో గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు తాను పూర్తి మద్దతు తెలియజేస్తున్నానని ఆయన స్పష్టం చేశారు.

ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు, ఉషశ్రీ. మార్కాపురం జిల్లా, గిద్దలూరు పట్టణం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదిక " కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు, కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ, పట్టణ ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యే కు తెలిపారు అందులో కొన్ని సమస్యలను అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించగా మిగిలిన సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దూర ప్రాంతాల వారిని ఉద్దేశించి వారి వద్దకే అధికారులు వచ్చి సమస్యలు తెలుసుకొని పరిష్కరించేలా కూటమి ప్రభుత్వం మరియు గౌరవ ముఖ్యమంత్రి వర్యులు పేద ప్రజలకు అన్ని విధాలుగా సహకారం అందించేందుకు కట్టుబడి ఉన్నారని "ప్రజల వద్దకే పాలన" అనే ఉద్దేశంతో నియోజకవర్గ స్థాయిలో గ్రీవెన్స్ రెడ్ రెసాల్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమంలో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, పట్టణ నాయకులు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొనీ అర్జీలు అందించారు

బాదుడే బాదుడుకు బ్రాండ్ అంబాసిడర్ గాడ్డలి పార్టీ

- ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ
- ఐదేళ్ల పాటు అడ్డగోలు దోపిడికి పాల్పడి.నేడు వీధి పోరాటాలా?
- ఆస్తి పన్ను, నీటి పన్ను, చెత్తపన్ను వ్యాట్ పేరుతో పెట్రోల్, డీజిల్ పై భారం
- తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు మోతతో ప్రజలకు చుక్కలు చూపించింది వాస్తవం కాదా?

గుంటూరు,, ఉషశ్రీ : 'బాదుడే బాదుడు"కు అసలైన బ్రాండ్ అంబాసిడర్ వైసీపీనేనని, ఐదేళ్ల పాటు అడ్డగోలు దోపిడికి పాల్పడి... నేడు వీధి పోరాటాలు చేపడితే నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ వ్యాఖ్యానించారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై వైసీపీ చేస్తున్న ఆందోళనలు పూర్తిగా ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ నాటకమని, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం, డాలర్ మారకం విలువ ప్రభావం, ఇరాన్--ఇజ్రాయిల్--అమెరికా యుద్ధ పరిస్థితుల కారణంగానే ఇంధన ధరల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయనే కనీస ఇంగిత జ్ఞానం లేకుండా... వాస్తవాలను దాచిపెట్టి కూటమి ప్రభుత్వంపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడదుల చేశారు. "ఏ మాత్రం ప్రపంచ జ్ఞానం లేని వైసీపీ వారు పెట్రోలు, డీజిల్ ధరలు కేవలం ఆంధ్రప్రదేశ్ లో మాత్రమే పెరిగినట్లుగా ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచంలోని చాలా దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలాయనే సంగతి తెలియదా?. చాలా దేశాలలో ఇంధన కొరత తీవ్రంగా ఉంది. ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలోని ఎన్ డి ఏ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవడం వల్ల ఇంధన కొరతను చాలా వరకు నియంత్రించగలిగాం. వంటగ్యాస్ కొరత కూడా లేకుండా జాగ్రత్తలు పాటిస్తున్నాం. అయితే అనివార్య పరిస్థితుల కారణంగా కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్ ధరలను స్వల్పంగా పెంచుతూ ఇటీవల ఒక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా ఈ పెంపు వర్తిస్తుంది. ఇది రాష్ట్ర ప్రభుత్వం చేసింది కాదు. ఇటీవల ఇంధన సంస్థలు పెట్రోలు బంకుల పేమెంట్ షెడ్యూలు మార్చడం వల్ల స్వల్ప అసౌకర్యం తలెత్తినప్పుడు కూడా వైసీపీ ఇదే విధంగా తప్పుడు ఆరోపణలు చేస్తూ ధర్నా డ్రామాలు ఆడింది. ఇప్పుడు కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంపై కూడా తప్పుడు ప్రచారం చేస్తుంది. గతంలో అంటే 2018లో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో లీటర్ పెట్రోలుకు రూ.2 సర్ చార్జి తగ్గించిన విషయం అందరికి తెలుసు. జగన్ రెడ్డి అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల కాలంలో రెండు సార్లు పెట్రోలు, డీజిల్ పై సర్ చార్జి పెంచి వినియోగదారులను దారుణంగా దెబ్బతీశాడు. అప్పటిలో దేశంలోనే అతి ఎక్కువ ఇంధన ధరలు ఉన్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ పేరుపొందింది. ఆనాడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బాదుడే బాదడుకు ఎంతో మంది బలయ్యారు. ఇంధనంపై సెస్ తగ్గించుకోవాలని ఎంత మంది కోరినా ఆనాడు జగన్ రెడ్డి వినలేదు సరికదా ఆర్టీసీ చార్జీలు, విద్యుత్ ఛార్జీలు అత్యధికంగా తొమ్మిది సార్లు పెంచి ప్రజలపై భారం మోపారు. వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యధిక ఇంధన ధరల రాష్ట్రంగా మారింది. యానాం, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలతో పోలిస్తే లీటర్‌కు రూ.5 నుంచి రూ.10 వరకు అధిక ధరలు వసూలు చేశారు. సరిహద్దు ప్రాంతాల ప్రజలు ఇతర రాష్ట్రాలకు వెళ్లి ఇంధనం నింపుకునే పరిస్థితి వచ్చింది. ఫలితంగా రాష్ట్రంలోని అనేక పెట్రోల్ బంకులు నష్టపోయాయి. అధికారంలో ఉన్న సమయంలో ప్రజలపై భారీ పన్నుల భారం మోపిన వైసీపీ ఇప్పుడు ప్రజల పక్షాన మాట్లాడటం రాజకీయ కపటత్వానికి నిదర్శనం. 2014 నుంచి 2019 వరకు ఐదేళ్లలో పెట్రోల్, డీజిల్ ధరలు కేవలం రూ.13 మాత్రమే పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం ధరలు పెంచిన సమయంలో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్ర ఆదాయాన్ని తగ్గించుకొని రూ.2 వరకు ఉపశమనం కల్పించింది. కానీ 2019 నుంచి 2024 మధ్య వైసీపీ పాలనలో పెట్రోల్, డీజిల్ ధరలు రూ.41 వరకు పెరిగాయి. ఆ కాలంలో వ్యాట్ పన్నులు, రోడ్ సెస్ పేరుతో ప్రజలపై తీవ్ర భారం మోపారు. " అని మోహనకృష్ణ తన లేఖలో పేర్కొన్నారు.

మధ్యలో బస్సు మార్పుతో ప్రయాణికుల అవస్థలు

ప్రైవేట్ ట్రావెల్స్ నిర్లక్ష్యంపై ప్రయాణికుల ఆగ్రహం

విజయవాడ/విశాఖపట్నం (ఉషశ్రీ) : ఒక మహిళ తన పిల్లలతో తన అన్న సహకారం తో విజయవాడ నుంచి విజయనగరం వెళ్లేందుకు ఎస్ వి కే డి టి ట్రావెల్స్ బస్సు (చీ 01 దీ 5299) 16 తారీకు రాత్రి ఎక్కారు. మరుసటి రోజు ఉదయం ఆ బస్సు విశాఖపట్నం గురుద్వార్ దగ్గరికి చేరుకోగానే విజయనగరం వెళ్లేవాళ్లు వేరే బస్సులు ఎక్కాలంటూ బస్సు నిర్వాహకులు చెప్పారు. దీంతో తన పిల్లల్ని లగేజీని మూసుకుంటూ వారు నిర్దేశించిన వేరే బస్సు (ఆ్రా 01 ఆ 6418) లోకి ఎక్కాల్సి వచ్చింది. ఇది అంతా ఆ ఒక్క మహిళే కాదు ఆ బస్సులో ప్రయాణం చేస్తున్న సుమారు 15 మంది ఇదేవిధంగా వేరే బస్సులోకి మారి ప్రయాణం చేయాల్సి వచ్చింది.దీనిపై ప్రశ్నిస్తే విజయనగరం వెళ్ళు బస్సు డ్రైవర్ సుబ్రహ్మణ్యం అవసరమైతే కంప్లైంట్ పెట్టుకోండి అని నిర్మోహమాటంగా నిర్భయంగా చెబుతున్నాడు విజయవాడ నుంచి విజయనగరం వెళ్లేందుకు ఎస్‌వీకేడీటీ అనే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ప్రయాణించిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విజయవాడ నుంచి బయలుదేరిన బస్సు విశాఖపట్నం వరకు వెళ్లిన అనంతరం, అక్కడి నుంచి విజయనగరం వెళ్లే మరో బస్సులోకి ప్రయాణికులను బలవంతంగా మార్చినట్లు బాధితులు తెలిపారు. ఈ ఆకస్మాత్తు మార్పుతో చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులో ప్రయాణించే వారిలో చిన్నపిల్లలతో కూడిన తల్లులు వృద్ధులు వారి కుటుంబ సభ్యుల సహకారంతో బస్సు ఎక్కువ ప్రయత్నం చేస్తుంటారు. లగేజీ కుటుంబ సభ్యులు బస్సు నిర్వాహకులు నిర్దేశించిన ప్రదేశంలో ఉంచి వీరిని బస్సు ఎక్కిస్తుంటారు. దిగే క్రమంలో కూడా ఇదేవిధంగా వారి కుటుంబ సభ్యులు గమ్యస్థానాలల్లో ఉండే వారి సంబందికులు బస్సులో దిగుతున్న వారిని తీసుకువెళ్లేందుకు వచ్చి వారి లగేజీ అని చేతబూని వారి సహకారంతో బస్సు దింపుతుంటారు. ఇది వృద్ధులు చిన్నపిల్లలు ఉన్న మహిళలు బస్సు ప్రయాణములలో తీసుకునే జాగ్రత్తలు. అయితే ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు చేస్తున్న పనులలో ఇటువంటి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సామాన్లు మోసుకుంటూ ఒక బస్సు నుంచి మరో బస్సులోకి ఎక్కాల్సి రావడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇలా చేయడం అన్యాయమని మండిపడ్డారు. సాధారణంగా ప్రయాణికులు ఒక బస్సుకు టికెట్ బుక్ చేస్తే, అదే బస్సులో గమ్యస్థానానికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ట్రావెల్స్ సంస్థపై ఉంటుంది. మధ్యలో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా మరో బస్సులోకి మార్చడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు కలిగితే, అది వినియోగదారుల హక్కుల ఉల్లంఘనగా పరిగణించబడే అవకాశం ఉంది. భారత మోటార్ వాహన చట్టం, రవాణా నిబంధనలు మరియు వినియోగదారుల హక్కుల ప్రకారం టికెట్ బుకింగ్ సమయంలో "బస్ చేంజ్ ఉండొచ్చు" అని స్పష్టంగా పేర్కొనకపోతే ప్రయాణికులను మధ్యలో బలవంతంగా మార్చడం సరైన విధానం కాదు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు, సామాన్లు ఉన్న ప్రయాణికులకు ఇబ్బంది కలిగేలా మార్పులు చేస్తే ఫిర్యాదు చేసే హక్కు మీకు ఉంటుంది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో లేదా భద్రత సమస్యలు ఉన్న ప్రాంతాల్లో ఇలా చేయడం పై అధికారులు సీరియస్‌గా తీసుకుంటారు. కొన్ని ప్రైవేట్ ట్రావెల్స్ "రూట్ ఆపరేషనల్ అడ్జస్ట్మెంట్" పేరుతో ఇలా చేస్తుంటాయి. కానీ అది ప్రయాణికులకు ముందుగా తెలియజేయాలి. టికెట్ బుకింగ్ సమయంలో నేరుగా విజయనగరం వరకు తీసుకెళ్తామని చెప్పి, మధ్యలో బస్సు మార్చడం ద్వారా ప్రయాణికులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థలు లాభాల కోసం ప్రయాణికుల సౌకర్యాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రైవేట్ ట్రావెల్స్‌పై రవాణాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు భంగం కలిగించే విధానాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యం రెచ్చిపోతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా పండుగలు, వేసవి సెలవుల సమయంలో ప్రైవేట్ బస్సుల అక్రమాలు పెరుగుతున్నాయని, అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇంద్రకీలాద్రి హుండీ ద ఆదాయం రూ.3.35 కోట్లు

విజయవాడ, మే 18: విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం లో హుండీల లెక్కింపు సోమవారం నిర్వహించారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ ఆధ్వర్యంలో దేవస్థానం అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, గత హుండీ లెక్కింపు మే 2 నుంచి ప్రస్తుత హుండీ లెక్కింపు18 వరకు 16 రోజుల కాలంలో మొత్తం రూ.3,35,87,555 ఆదాయం లభించిందని ఈవో తెలిపారు. ఇందులో భారతీయ కరెన్సీ నోట్లు రూపంలో రూ.3,20,79,555, నాణేల రూపంలో రూ.15,08,000 వచ్చినట్లు తెలిపారు. సగటున రోజుకు రూ.20,99,222 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. భక్తులు హుండీలలో 232 గ్రాముల బంగారం, 4 కిలోల 200 గ్రాముల వెండి సమర్పించారు. అదనంగా అమెరికా డాలర్లు, ఖతార్ రియాల్స్, యూఏఈ దిర్హామ్స్, యూరోలు, పౌండ్లు తదితర విదేశీ కరెన్సీలు కూడా హుండీలలో లభించాయి.

గంగాలమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే

పండుగకి రూ;10,000/- లు సాయం చేసిన ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

రాజవొమ్మంగి, మే 18 (ఉష శ్రీ విలేఖరి): కోరిన కోర్కెలు నెరవేర్చిన గ్రామ దేవతలకు కృతజ్ఞత కలిగి జాతర చేయడం పురాతన అనవాయితీ అని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్,ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజవొమ్మంగి మండలం సింగంపల్లి గ్రామంలో సోమవారం గంగాలమ్మ జాతర భోనాలు పండుగ నిర్వహించారు. పండుగకి విచ్చేసిన ఆమెకు గ్రామస్తులు హారతులు, పూలతో గిరిజన సంప్రదాయ పద్ధతిలో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భోనాలు పండుగ అనేది గ్రామ దేవతలకు నైవేద్యంగా అర్పించే ప్రీతి పాత్రమైన కృత్యం అన్నారు. దీనిలో మహిళా సాధికారిత, సామాజిక ఐక్యతకు ప్రతీక అని కొనియాడారు. అనంతరం ఆమె గ్రామస్తులతో కలిసి గ్రామ దేవత అమ్మవారికి భోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని సమర్పించారు. బోనాలు పండుగకి రూ;10,000/- లు ఆమె ఆర్థిక సాయం అందించారు. జాతరలో పలు సాంస్కృతిక కార్య క్రమాలు ఆకట్టుకున్నాయి. పలు సమస్యలపై విన్నవించగా స్పందించిన ఆమె ప్రాధాన్యతక్రమంలో పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విచ్చేసిన ఆమెకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆదివాసీ సామూహిక వివాహ లగ్న పత్రిక ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే : ఆదివాసీల పై ప్రత్యేకశ్రద్ధ తో సామూహిక వివాహ మహోత్సవాలు చేయడం అత్యంత శుభ ప్రథమని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డ గ్రామంలో సోమవారం దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ మరియు వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించే ఆదివాసీ సామూహిక వివాహ మహోత్సవ లగ్న పత్రిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమెకు చారిటబుల్ ట్రస్ట్ వారు సాంప్రదాయ బద్ధంగా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి సమక్షంలో నిర్వహించే ఇలాంటి శుభ కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇస్తాయన్నారు. మా ఆదివాసీ ప్రాంతాల్లో 106 గిరిజన జంటలకు వివాహాలు ఉచితంగా శాస్త్రోక్తంగా జరిపించడం శుభదాయక మన్నారు. దీనిలో భాగంగా లగ్న పత్రిక ఆవిష్కరణ చేయడం మరియు పెళ్ళిరాట వేయటం మంచిదన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మన్యంలో విస్తృతంగా చేయాల్సిన అవశ్యకతపై చైతన్యం చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం సి డైరెక్టర్ గట్టి మాణిక్యం, ఎంపీటీసీ నల్లా సత్తిబాబు, మాజీ సర్పంచ్ ఆగూరి సుబ్బలక్ష్మి, కొంగర సావిత్రి, తెదేపా నాయకులు అప్పారావు, గంగరాజు, బన్ను, బిజెపి పోలవరం జిల్లా అధ్యక్షులు ఈక బుల్లి కొండలు, ఉమ్మడి ఏ ఎస్ అర్ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి జుర్రా గౌరీ పార్వతి, గంగవరం మండలం పార్టీ బీజేపీ అధ్యక్షులు పుట్టపల్లి నీలాలమ్మ, మండల అధ్యక్షులు లోసుల రాజుబాబు, రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కుంజం సత్య నారాయణమ్మ. విశ్వహిందు ధర్మ పరిరక్షణ రామసేన పోలవరం జిల్లా ఇంచార్జి కడబాల సుధా, బిజెపి కార్యకర్తలు మరియు దాన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు. డి వి డి ప్రసాద్, తాము సూరిబాబు, బొరగా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫేక్ అకౌంట్లతో రూ.5.28 కోట్ల బ్యాంకు రుణ మోసం చేసిన నిందితుడి అరెస్ట్

విజయవాడ,(ఉషశ్రీ)మే 18: విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ బ్యాంకు రుణ మోసం కేసులో నిందితుడిని అరెస్ట్ చేశారు. ఫేక్/మ్యూల్ బ్యాంకు అకౌంట్ల ద్వారా సుమారు రూ.5.28 కోట్ల వరకు లోన్లు తీసుకుని మోసం చేసిన కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి సుమారు రూ.7 కోట్ల విలువైన ఆస్తులకు సంబంధించిన పత్రాలు, బంగారం, వెండి, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం 2019 సంవత్సరం నుంచి విజయవాడలోని పలు యాక్సిస్ బ్యాంక్ బ్రాంచ్‌లలో 26 సేవింగ్స్ ఖాతాలు తెరిచి, క్రెడిట్ కార్డులు మరియు వివిధ రకాల లోన్ల ద్వారా భారీ మొత్తంలో డబ్బు తీసుకుని తిరిగి చెల్లించకుండా తప్పించుకుని తిరుగుతున్నాడని వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు విచారణ ప్రారంభించారు. నగర పోలీస్ కమిషనర్ సా.ఎ. రాజశేఖర బాబు ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ డీసీపీ కే . కృష్ణ ప్రసన్న సూచనలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణా జిల్లా గూడూరుకు చెందిన నీలం పవన్ కుమార్ (45) ఈ-సేవలో పనిచేస్తుంటాడు. జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని ఉపయోగించి తప్పుడు శాలరీ స్లిప్స్, ఐడీ కార్డులు తదితర పత్రాలు తయారు చేశాడు. వాటిని ఉపయోగించి యాక్సిస్ బ్యాంక్ గుణదల బ్రాంచ్‌లో 9 ఫేక్ అకౌంట్ల ద్వారా రూ.1.76 కోట్లు, ఏలూరు రోడ్ బ్రాంచ్‌లో 10 అకౌంట్ల ద్వారా రూ.1.32 కోట్లు, మెయిన్ బ్రాంచ్‌లో 7 అకౌంట్ల ద్వారా రూ.2.20 కోట్లు రుణాల రూపంలో పొందినట్లు గుర్తించారు. మొత్తం 26 అకౌంట్ల ద్వారా సుమారు రూ.5.28 కోట్ల వరకు లోన్లు తీసుకుని వాటిని జల్సాలకు వినియోగించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిపై గతంలో గూడూరు, బందరు టౌన్, భవానీపురం, కృష్ణలంక పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. దర్యాప్తులో భాగంగా సూర్యారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడి వద్ద నుంచి 34 స్థిరాస్థుల డాక్యుమెంట్లు, ఒక కారు, ఒక బైక్, 122 గ్రాముల బంగారం, 927 గ్రాముల వెండి, 9 ఏటీఎం కార్డులు, రూ .11,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

చారిత్రక వారసత్వానికి వేడుకల వేదికగా ఇందిరాగాంధీ మైదానం

విజయవాడ,(ఉషశ్రీ) మే 18: అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్‌టీఆర్ జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన "రూట్స్ రీ లోడెడ్" కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. చరిత్ర, సంస్కృతి, కళల పరిరక్షణకు అంకితమైన ఈ వేడుకల్లో ప్రజలు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, 20 పాయింట్ల కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం, ఏపీ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, ఏపీటీడీసీ చైర్‌పర్సన్ ఎన్. బాలాజీ, ఆర్కియాలజీ అండ్ మ్యూజియమ్స్ కమిషనర్ పి. సురేష్, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మ్యూజియంలు మన సంస్కృతి, నాగరికత, వారసత్వ సంపదకు ప్రతీకలని పేర్కొన్నారు. యువతలో చరిత్ర, కళలపై ఆసక్తి పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. భావితరాలకు చారిత్రక సంపదను చేరవేయాలంటే విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం అవసరమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో నిర్వహించిన కళా ప్రదర్శనలు, సాంస్కృతిక నృత్యాలు, సంగీత ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మ్యూజియంల ప్రాధాన్యం, వారసత్వ పరిరక్షణ అవసరాన్ని తెలియజేస్తూ ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా భారత నాగరికత ఆనవాళ్లు కనిపించడం మన సంస్కృతి వైభవానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్, ఆవకాయ్ ఉత్సవ్, ప్రపంచ వారసత్వ దినోత్సవం, అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం వంటి కార్యక్రమాలు యువతలో సృజనాత్మకతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఇలాంటి వినూత్న కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశను మంత్రి అభినందించారు.

పుష్పాలంకరణ వేడుకల్లో పాల్గొన్న యారవ రమా శ్రీనివాసులు

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ పామూరు మండలంలోని పడమర కట్ట కింద పల్లి గ్రామంలో గజ్జల వారి పుష్పాలంకరణ వేడుకల్లో పాల్గొని చిరంజీవిని ఆశీర్వదించిన కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవరమా శ్రీనివాసులు, మరియు పామూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల చైర్మన్ గుత్తి ఏడుకొండలు మరియు గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

మోపాడులో నూతన డీప్ బోర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న పచ్చవ..మోరబోయిన

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ఆదేశాల మేరకు పామూరు మండలం లో మోపాడు గ్రామపంచాయతీలో మోపాడు బంగ్లా గంగానగర్ కాలనీలో పంచాయతీ నిధులతో నూతనంగా డీప్ బోర్ ను మోపాడు తెలుగుదేశం పార్టీ నాయకులు పచ్చవ బాబు, మోపాడు రిజర్వాయర్ వైస్ చైర్మన్ నరసింహారావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ మోపాడు బంగ్లా గంగానగర్ కాలనీ వాసులకు తాగునీటి తాగునీటి ఇబ్బందులను కీర్తనలు ఉద్దేశంతో మోపాడు గ్రామపంచాయతీ మరియు స్థానిక నాయకులు ఆధ్వర్యంలో నూతనంగా డీప్ బోరును ప్రారంభించామని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో మోర బోయిన గిడ్డయ్య, మట్లే రాహుల్ యాదవ్, మన్నం ధనేంద్ర, షేక్ జాన్ బాషా గ్రామస్తులు పాల్గొన్నారు

జర్నలిస్టు రవి అస్తమయం...

పాత్రికేయ లోకానికి తీరని లోటు
విశాఖ జర్నలిస్టు సంఘాల ఘన నివాళి

విశాఖపట్నం ఉష శ్రీ ప్రతినిధి కిరణ్ కుమార్ విశాఖలో జర్నలిస్టు రవి అంటే తెలియని వారెవరు ఉండరేమో 19 ఏళ్లగా ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో సేవలు అందించిన పాలికి రవి (45) అనారోగ్యంతో మృతి చెందారు. కొన్నాళ్ళుగా ఆరిలోవలోని అపోలో ఆసుపత్రిలో ఎక్మో చికిత్స పొందుతున్న ఆయన సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఎన్ఏడి మరిపాలెం ప్రాంతాల్లో ఐ న్యూస్, సుమన్ టీవీ, 99 టీవీల్లో జర్నలిస్టుగా పనిచేసిన రవి అందరివాడిగా పేరుగాంచారు. జర్నలిస్టు సంఘాలు ,ప్రజా సంఘాలు ,అధికారులు ,రాజకీయ నాయకులు జర్నలిస్టు రవి మృతికి ఘన నివాళి అర్పించారు. రవి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

శ్రీకాళహస్తి గుడిలో ప్రత్యేక పూజలో పాల్గొన్న దర్శి,బొంతల, ప్రవీణ్, నాని



న్యూస్ 20 20 పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ శ్రీకాళహస్తి ఆలయం నందు రాహు కేతు పూజ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం గర్భగుడిలో ప్రత్యేక పూజ కార్యక్రమం కల్పించిన శ్రీ కాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టే సాయి వెంకట్ వారిని వారి క్యాంపు కార్యాలయం నందు శాలువాతో సన్మానించిన జనసేన పార్టీ పామూరు మండల అధ్యక్షులు దర్శి ఏడుకొండలు, బొంతల సుధీర్, ప్రవీణ్, నాని నాయుడు

సాంఘిక సంక్షేమ వసతి గృహాలను సద్వినియోగం చేసుకోండి - వెల్ఫేర్ అసిస్టెంట్ రాచూరి ఏలియా

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ సోమవారం సిఎస్ పురం మండలం పెద్ద గోగులపల్లి ఎస్సీ కాలనీ నందు సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ డీడీ ఎన్ లక్ష్మా నాయక్ ఆదేశాలు మేరకు అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా రాచూరి ఏలియా మాట్లాడుతూ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ హాస్టల్ బాగా అభివృద్ధి చేసి మంచి పౌష్టిక ఆహారం అందిస్తూ మంచి సదుపాయాలు కల్పిస్తుందని ఇక్కడ విద్య అభ్యసించిన విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారాని ఈ అవకాశం మీరు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు ఈకార్యక్రమంలో విద్యార్థుల తల్లి దండ్రులు రాజు, పాల్గొన్నారు

ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం దేశానికే గర్వ కారణం.

డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి

ఉష శ్రీ బద్వేల్ పోరుమామిళ్ల ప్రతినిధి రామలక్షమయ్య మహానాడు పై తీసుకున్న నిర్ణయం మరోసారి దేశానికి ఆదర్శంగా గర్వకారణంగా నిలిచిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ చరిత్రలో నిలిచిపోయే విధంగా అద్భుతమైన నిర్ణయం తీసుకోవడం జరిగిందని డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి కొనియాడారు. సోమవారం ఆయన తమ కార్యాలయంలో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఎంతో ఉత్సాహంగా నిర్వహించే మహానాడు పండుగను దేశ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు స్పందిస్తూ మహానాడు పండుగను పర్చువల్ పద్ధతిలో నిర్వహించాలనేది తీసుకున్న నిర్ణయం గొప్ప బాధ్యతాయుతమైనదిగా పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఎక్కడ లేని విధంగా ప్రజల ప్రయోజనాలను ముందుగానే ఆలోచిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలోనే రోల్ మోడల్ గా నిలిపిన నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం నిజంగా అభినందనీయమైనది. తెలుగుదేశం పార్టీ శ్రేణులకు మహానుడు అనేది భావోద్వేగపూరిత వేడుక అయినప్పటికీ దేశ పరిస్థితులు దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం ప్రతి ఒక్కరు స్వాగతించి అభినందించాల్సిన అవసరం ఉంది. 2006 పర్చువల్ పద్ధతిలో మహానాడు నిర్వహణ రెండు రోజులపాటు నిర్వహించనున్న తెలుగుదేశం పార్టీ పొదుపు చర్యల్లో భాగంగా కీలక నిర్ణయం తీసుకున్నా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్లో ప్రత్యేక స్టేజి ఏర్పాటు చేసి ఆన్లైన్లో మహానాడు నిర్వహణ రాష్ట్రవ్యాప్తంగా 1,845 కస్టర్లలో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొనే విధంగా ఎన్టీఆర్ భవన్ నుంచి పాలిట్ బ్యూరో సభ్యులు, ముఖ్య నాయకులు పాల్గొనే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు సాంకేతికతను వినియోగిస్తూ సాంప్రదాయాన్ని

కొనసాగించే వినూత్న ఆలోచనతో తెలుగుదేశం పార్టీ మరోసారి దేశానికే మార్గదర్శంగా నిలిచిందని చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి అన్నారు.

ఉపాధి సమస్యలపై ఏపీవోను కలిసిన మండల టిడిపి ప్రధాన కార్యదర్శి ముత్తూరు సుమన్ బాబు.

ఉష శ్రీ ప్రతినిధి సీతారామపురం మండలం (మే 18) మండలంలో ని 14 పంచాయతీలలోని ఉపాధి శ్రామికులకు పనులు కల్పించాలని కోరుతూ మండల టిడిపి ప్రధాన కార్యదర్శి ముత్తూరు సుమన్ బాబు సోమవారం ఉపాధి ఏపీఓ శ్యామలాదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 14 పంచాయతీలో ఉన్న ఉపాధి శ్రామికులకు ప్రతిరోజు తప్పక పని కల్పిస్తూ రావాల్సిన వేతనాలు సకాలంలో అందే విధంగా చూడాలని కోరారు. అదేవిధంగా దేవరాజుసూరయపల్లి గ్రామంలో గత కొన్ని నెలలుగా ఎటువంటి ఉపాధి హామీ పనులు చేపట్టకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సుమారు ఇంచుమించు సంవత్సరం రోజుల నుండి ఉపాధి కల్పించకపోవడంతో శ్రామికులు వారి పని దినాలను కోల్పోవడం జరుగుతుందని వాపోతున్నారు. ఈ విషయమై గ్రామ ప్రజలు గతంలో ఎంపీడీవో కి వినతి అందించడం కూడా జరిగినదని అయినా కూడా ఎటువంటి స్పందన లేదని మండిపడ్డారు.అధికారులు స్పందించి దేవరాజుసూరయపల్లి గ్రామంలో పని కల్పించాలని కోరారు.

చల్లని చూపుతో కరుణించు తల్లీ వనదుర్గమ్మా

పోలవరం జిల్లా దేవీపట్నం, ఉష శ్రీ ప్రతినిధి వెంకట్ : ఇందుకూరు: పోలవరం జిల్లా దేవీపట్నం మండలం ఇందుకూరు గ్రామ శివారులో వెలసిన శ్రీ వనదుర్గ అమ్మవారి ఆలయం వద్ద బోనాల ఉత్సవాన్ని కోలాట ప్రదర్శనతో వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఈపి సూరిబాబు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి మల్లిశాల గ్రామం నుంచి కోలాట బృందం విచ్చేసి అలరించింది. బోనాలతో గ్రామస్తులు ఊరంతా ఊరేగింపుగా వెళ్లారు. తెల్లవారుజాము నుంచే 30 మంది దంపతులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయ ప్రాంగణమంతా ఉత్సవ శోభ సంతరించుకుంది. శ్రీ వనదుర్గ అమ్మవారి ఆలయ నిర్మాణం జరిగి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టినట్లు చైర్మన్ ఈపి సూరిబాబు విలేకరులకు వెల్లడించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తుల కొంగు బంగారం వనదుర్గమ్మ : ఇందుకూరు గ్రామ చివర కొలువైన శ్రీ వనదుర్గమ్మ అమ్మవారిపై భక్తులకు అపారమైన విశ్వాసం ఉందని, కోరిన కోర్కెలు తీర్చే చల్లని తల్లిగా అమ్మవారిని భక్తులు నమ్ముతారని స్థానికులు తెలిపారు.

నేడు అన్నదానం : మంగళవారం శ్రీ వనదుర్గ అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్న సంతర్పణ ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ ఈపి సూరిబాబు తెలిపారు. పరిసర గ్రామాల భక్తులంతా విచ్చేసి అన్నప్రసాదం స్వీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

టిటిడి అధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు

కర్నూలు ఉష శ్రీ మే 18 :- తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో ఆదోని పట్టణం, వసంత టాకీస్ సమీపంలోని శ్రీ రుక్మిణి పాండురంగస్వామి దేవస్థానంనందు ఈ నెల 19వ తేదీ మంగళవారం నుండి 22వ తేదీ శుక్రవారం వరకు ధార్మిక కార్యక్రమాలు ప్రతిరోజు సాయంత్రం 6-00 గంటలకు ఏర్పాటు చేసినట్లు ఇందులో భాగంగా ప్రతిరోజు ఇస్కాన్ ధర్మప్రచారకులు నిత్యతృప్తదాస్ చే ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, శుక్రవారం ఉదయం 10 గంటలకు గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఇందుకు సంబందించిన కరపత్రాలను ఆలయ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షులు మహేంద్రకర్ లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు జె. ఈశ్వరరావు, కార్యదర్శి జవేల్కర్ బాబురావు, సంయుక్త కార్యదర్శి జె. వెంకటేశ్వరరావు, కోశాధికారి పతంగి నరసింగరావు, వడే రఘు, సూత్రవే ఆనంద్, సరోదే వెంకోబరావు, ఆదోని తితిదే కళ్యాణ మండపం సిబ్బంది చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి మెడికల్ అసోసియేషన్ వినతి

గిద్దలూరు ఉష శ్రీ మే 18 :- మార్కాపురం జిల్లా గిద్దలూరులో దేశవ్యాప్తంగా ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న మెడికల్ షాపుల బంద్‌కు మద్దతుగా స్థానిక మెడికల్ దుకాణ యజమానులు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నల్ల బ్యాడ్జీలు ధరించి గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మెడికల్ రంగంలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయాలని కోరారు. ఔషధ వ్యాపారులకు ఇబ్బందులు కలిగించే విధానాలను సవరించి, వ్యాపార రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ది గిద్దలూరు మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు తుమ్మలపెంట వెంకటసుబ్బయ్య, సెక్రటరీ బచ్చు చంద్రశేఖర్,ట్రెజరీ తుమ్మలపెంట సురేష సభ్యులు , ఫార్మసిస్టులు మరియు వ్యాపార సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తుల రద్దీతో సందడిగా మరినా శ్రీశైలం క్షేత్రం

వేసవి సెలవులు కావడంతో స్వామి అమ్మవార్లకు మొక్కులు తీర్చుకునేందుకు దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు..!

భక్తుల రద్దీ దృష్ట్యా శని,ఆది, సోమవారాలలో ఆర్జిత అభిషేకాలు,కుంకుమార్చనలు నిలుపుదల చేసిన అధికారులు..!

ఉచిత, శీఘ్ర,అతిశీఘ్ర,దర్శనాల క్యూలైన్ల ద్వారా భారీగా భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు..!

ఆన్లైన్లో విఐపి బ్రేక్ దర్శనం టికెట్లు బుక్ చేస్తున్న భక్తులకు 2 విడతలుగా స్పర్శ దర్శనానికి అనుమతి ఇస్తున్న అధికారులు..!

శ్రీస్వామి అమ్మవార్ల దర్శనానికి సుమారు 4 గంటల సమయం పడుతుంది..!

శ్రీశైలం దేవస్థానం ఉష శ్రీ మే:18: నంద్యాల జిల్లా శ్రీశైలం మహాక్షేత్రంలో భక్తులు సందడి నెలకొంది వేసవి సెలవులు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శిస్తున్నారు తెలుగు రాష్ట్రాల నుంచి కాకుండా కర్ణాటక,మహారాష్ట్ర భక్తులు అధిక సంఖ్యలో శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనానికి తరలివస్తున్నారు క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి స్వామి అమ్మవార్లకు మొక్కులు తీర్చుకునేందుకు దర్శనానికి భారీగా తరలి వచ్చిన భక్తులు క్షేత్రమంత భక్తజనంతో సందడి వాతావరణం నెలకొంది భక్తులు వేకువజామున నుండే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్ల దర్శనార్థమై క్యూలైన్స్ లో దర్శన కంపార్టుమెంట్లలో బారులు తీరారు శ్రీ స్వామి అమ్మవార్ల దర్శనానికి సుమారు 4 గంటల సమయం పడుతుంది మరోపక్క భక్తులు రద్దీ దృష్ట్యా శని,ఆది, సోమవారలో ఆర్జిత అభిషేకాలు, కుంకుమార్చన నిలుపుదల చేసిన అధికారులు,సామాన్య భక్తులకు ఉచిత,శీఘ్ర,అతిశీఘ్ర, దర్శనానికి క్యూలైన్ల ద్వారా స్వామి అమ్మవార్లను దర్శించుకుం టున్నారు,ఆన్లైన్లో విఐపి బ్రేక్ టికెట్లు బుక్ చేసుకున్న భక్తులకు 2 విడతలుగా ఉదయం 7:30 రాత్రి 9 గంటలకు మాత్రమే స్పర్శ దర్శనానికి అనుమతిస్తున్న అధికారులు,భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ క్యూలైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా శ్రీస్వామి అమ్మవార్లను దర్శించుకునేలా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు దర్శనార్థమై క్యూలైన్లు,కంపార్ట్మెంట్లలో ఉన్న భక్తులకు ఎప్పటికప్పుడు అల్పాహారం,బిస్కెట్స్ మంచినీరు అందిస్తున్నామని దేవస్థానం ఈవో శ్రీనివాసరావు తెలిపారు

లోకకల్యాణార్థం పంచమఠాలలో పూజాదికాలు

శ్రీశైలం దేవస్థానం ఉష శ్రీ మే:18: లోక కల్యాణార్థం పంచమఠాలలో సోమవారం ఉదయం విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించారు ముందుగా ఘంటామఠంలో ఆ తరువాత వరుసగా భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో ఈ పూజాదికాలు జరిపించారు విశేషపూజాదికాలలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణ సంకల్పాన్నిపఠించారు. ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలనీ, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలనీ, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు నిర్వహించబడ్డాయి. తరువాత అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించబడ్డాయి. కాగా శ్రీశైల సంస్కృతిలో చాలాకాలం పాటు మఠాలు ప్రధానపాత్ర పోషించాయి. ప్రస్తుత సాధారణశకం 7వ శతాబ్దం నుంచి నిర్మించబడ్డ ఈ మఠాలు, గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం లాంటి నిర్మాణాలను కలిగివుండి, చూడటానికి ఆలయాల మాదిరిగానే కనిపిస్తాయి. కొన్ని శతాబ్దాల నుండి కూడా ఈ మఠాలన్నీ క్షేత్ర ప్రశాంతతలోనూ, ఆలయ నిర్వహణలోనూ, ఆధ్యాత్మికపరంగా, భక్తులకు సదుపాయాలను కల్పించడంలోనూ ప్రధాన భూమికను వహించాయి. శ్రీశైలంలో కొన్ని మఠాలు కాలగర్భములో కలిసిపోగా, ప్రస్తుతం ఆలయానికి దగ్గరలో వాయువ్య భాగాన ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠం అనే మఠాలు పంచమఠాలనే పేర్లతో పిలువబడుతున్నాయి. కాగా శిథిలావస్థలో ఉన్న ఈ మఠాలలో ఘంటామఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠాలను దేవస్థానం పూర్తిగా పునరుద్ధరించింది. ప్రాచీన నిర్మాణశైలికి ఎలాంటి విఘాతం కలుగకుండా ఈ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయబడ్డాయి. అదేవిధంగా భీమశంకర మఠానికి తగు మరమ్మతులు కూడా చేయబడ్డాయి. ఈ మఠాలలోని దేవతామూర్తులకు నిత్యధూపదీప నివేదన కైంకర్యాలు జరిపించడం జరుగుతుందని ఆలయ అధికారులు మీడియాకు తెలిపారు

నెరవేరనున్న దోర్నాల ప్రజల ఆకాంక్ష

- ఈ నెల 21 న బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన.
- బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి

మార్కాపురం ఉష శ్రీ మే 18 :- నల్లమల అటవీ ప్రాంతం గుండా శ్రీశైల మహాక్షేత్రానికి వేలాదిమంది శివభక్తులు దిగువ శ్రీశైలం అయినటువంటి దోర్నాల గుండా ప్రయాణిస్తున్న నేపథ్యంలో దోర్నాలలో ఆధునిక బస్టాండ్ నిర్మాణానికి ఎన్డీఏ ప్రభుత్వం శ్రీకారం చుట్టడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రజల ఎదురుచూపులకు కారణమైన దోర్నాల బస్టాండ్‌కు ఈ నెల 21న శంకుస్థాపన జరగడం శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు. శ్రీశైలం జ్యోతిర్లింగ దర్శనానికి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది శివభక్తులు నల్లమల అడవుల మార్గంలో ప్రయాణిస్తుంటారని, అలాంటి కీలక ప్రాంతమైన దోర్నాల లో సరైన బస్టాండ్ సదుపాయం లేక భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన గుర్తు చేశారు. ఈలాంటి పరిస్థితుల్లో కొత్త బస్టాండ్ నిర్మాణం పూర్తయితే శ్రీశైలం వెళ్లే భక్తులకు విశ్రాంతి, రవాణా, భద్రతా సదుపాయాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. ముఖ్యంగా నల్లమల అటవీ ప్రాంతంలో ప్రయాణించే యాత్రికులకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారుతుందని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి దోర్నాల అభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఈ బస్టాండ్ నిర్మాణం ప్రాంతీయ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. దీంతో

శ్రీశైలం యాత్రను మరింత సౌకర్యవంతంగా మార్చే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగని బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ రామచంద్రారెడ్డి అభిప్రాయపడ్డారు

ఆత్మకూరు నందికుంట కురుకుంద దారిలో అక్రమ ఇటుకల దందా..!!

- అధికారులు నిమ్మకు నీరెత్తినట్లా చట్టాలు చుట్టాలయ్యాయా అను మతులు లేవు రాయల్టీ కట్టరు..!
- ఆత్మకూరు పరిధిలో కొన్ని ఇటుకల బట్టీల యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన మైనింగ్ ఎన్విరాన్మెంట్ చట్టాలకు పాతర..!
- నందికుంట కురుకుంద దారిలో వెలిసిన కొన్ని అక్రమ ఇటుకల బట్టీలు కాలుష్య కోరల్లో గ్రామాలు
- నిబంధనల ఉల్లంఘనపై చర్యలేవి..!
- ఆత్మకూరులో కాసులు కురిపిస్తున్న మట్టి వ్యాపారం సర్కారు ఆదాయానికి గండి కొడుతున్న కొన్ని అక్రమ బట్టీలు..!

శ్రీశైలం నియోజకవర్గం ఉష శ్రీ మే:18: నంద్యాల జిల్లా ఆత్మకూరు మండల పరిధిలో ప్రభుత్వ నిబంధనలకుచట్టాలకు విరుద్ధంగా అక్రమ ఇటుకల బట్టీల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది ముఖ్యంగా ఆత్మకూరు పట్టణం నుండి నందికుంట కురుకుంద గ్రామాలకు వెళ్లే దారిలో ఎటువంటి అధికారిక అనుమతులు లేని కొన్ని ఇటుకల బట్టీలు వెలిశాయి స్థానిక యంత్రాంగం నిఘా లోపం సంబంధిత శాఖల అధికారుల ఉదాసీనతను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు ప్రభుత్వ భూములను, సహజ వనరులను యథేచ్ఛగా దోచేస్తున్నారు

చట్టాల ఉల్లంఘన మైనింగ్ నిబంధనలకు పాతర..!! ఆంధ్రప్రదేశ్ మైనర్ మినరల్ కన్సెషన్ రూల్స్ ప్రకారం ఇటుకల తయారీకి వాడే మట్టి ని తవ్వాలంటే గనుల శాఖ నుండి ముందస్తు పొంది ప్రభుత్వానికి సీనరేజ్ ఫీజు మరియు రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. కానీ నందికుంట కురుకుంద దారిలోని కొన్ని బట్టీల నిర్వాహకులు ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా రాయల్టీ చెల్లించకుండా చెరువులు కుంటలను గుల్ల చేస్తూ అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు తెలుస్తుంది దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది.

గాలిలో కలిసిపోతున్న పర్యావరణ చట్టాలు..!! పర్యావరణ పరిరక్షణ చట్టం–1986 మరియు ఎయిర్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ పొల్యూషన్ యాక్ట్ ప్రకారం ప్రతి ఇటుకల బట్టీకి కాలుష్య నియంత్రణ మండలి నుండి తప్పనిసరిగా అనుమతి ఉండాలి అంతేకాకుండా కాలుష్యాన్ని తగ్గించే అధునాతన జిగ్–జాగ్ సాంకేతికతను మాత్రమే వాడాలి. కానీ ఇక్కడ నడుస్తున్న కొన్ని అక్రమ బట్టీల్లో పాత పద్ధతిలోనే దట్టమైన పొగను వదులుతూ పర్యావరణాన్ని పూర్తిగా దెబ్బతీస్తున్నారు ఈ దారి గుండా ప్రతిరోజూ ప్రయాణించే నందికుంట కురుకుంద గ్రామ ప్రజలు పాఠశాల విద్యార్థులు మరియు వాహనదారులు తీవ్రమైన గాలి కాలుష్యానికి గురవుతూ శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు

?రెవెన్యూ చట్టాల ఉల్లంఘన చోద్యం చూస్తున్న అధికారులు..!!:

నిబంధనల ఉల్లంఘన - ప్రభుత్వ ఖజానాకు గండి!

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయేతర భూమి మార్పిడి చట్టం ప్రకారం వ్యవసాయ భూమిని ఇటుకల బట్టీ లాంటి వాణిజ్య అవసరాలకు వాడుతున్నప్పుడు ల్యాండ్ కన్వర్షన్ నాళా అనుమతులు చేసుకోవాల్సి ఉంటుంది నందికుంట కురుకుంద దారిలో ఉన్న ఈ కొన్ని అక్రమ బట్టీలకు ఎటువంటి అనుమతులు లేవనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి

నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న యంత్రాంగం..!!: ఆత్మకూరు మండల పరిధిలో భూగర్భ వనరుల రక్షణ నిబంధనల అమలును పర్యవేక్షించాల్సిన అధికార యంత్రాంగం ఈ అక్రమాలపై ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లంచాలకు లొంగిపోయి అధికారులు అక్రమ బట్టీల నిర్వహణను ప్రోత్సహిస్తున్నారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ?ఈ అక్రమ ఇటుకల బట్టీల దందాపై ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని నిబంధనలు ఉల్లంఘించిన కొన్ని బట్టీలను సీజ్ చేసి, ప్రభుత్వ సొమ్మును దోచుకున్న వారిపై కఠిన చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలని నందికుంట, కురుకుంద గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

పట్టా ఉంటేనే పన్ను అగ్రిమెంట్లు ఉంటే వేయం కమిషనర్ వింత వాదన....!!

శ్రీశైలం నియోజకవర్గం ఉష శ్రీ మే:18: నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణంలో అప్పట్లో ప్రభుత్వం కట్టించిన ఇళ్లకు సంబంధించి ఒక విచిత్రమైన చట్ట ఉల్లంఘన తెరపైకి వచ్చింది నివాసం ఉంటున్న పేద ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మా ఇళ్లకు పన్ను హౌస్ టాక్స్ కట్టించుకోండి మాకు అసెస్మెంట్ నంబర్లు ఇవ్వండి అని మొరపెట్టుకుంటున్నా మున్సిపల్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు ప్రభుత్వ ఖజానాకు ఆదాయం తెచ్చే విషయంలో అధికారులు చూపిస్తున్న ఈ నిర్లక్ష్యంపై పట్టణంలో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

?ఏపీ మున్సిపల్ చట్టం 85 అండ్ 86 నిబంధనలు ఏం చెబుతోంది.. ఆంధ్రప్రదేశ్ పురపాలక సంఘాల చట్టం ప్రకారం ఒక ఆస్తిపై పన్ను విధించడానికి మున్సిపాలిటీకి కావలసింది కేవలం ఆ భవనంలో ఎవరు నివసిస్తున్నారు అనే ఆధారం మాత్రమే ?సెక్షన్ 85 ఈ నిబంధన ప్రకారం మున్సిపల్ పరిధిలోని అన్ని రకాల భవనాలు భూములపై ఆస్తి పన్ను విధించే సర్వాధికారాలు మున్సిపాలిటీకి ఉన్నాయి. ఇక్కడ ఆస్తి రిజిస్ట్రేషన్ అయిందా లేదా అనేదానితో సంబంధం లేదు ?సెక్షన్ 86 ఈ సెక్షన్ స్పష్టంగా చెబుతోంది ఆస్తి పన్ను చెల్లించాల్సిన ప్రాథమిక బాధ్యత సదరు భవనాన్ని లేదా స్థలాన్ని అనుభవిస్తున్న వ్యక్తిపై ఉంటుంది. యజమాని అందుబాటులో లేకపోయినా లేదా యజమాని ఎవరనే వివాదం ఉన్నా ప్రస్తుతం ఆ స్థలంలో నివసిస్తూ లాభం పొందుతున్న లబ్ధిదారుడి నుంచే పన్ను వసూలు చేయాలని చట్టం నిర్దేశిస్తోంది ఆక్యుపేషన్ తాబేదారు ప్రాతిపదిక నివాస స్థలంలో మనుషులు ఉంటున్నారా లేదా అనేదే మున్సిపల్ టాక్స్‌కు ప్రామాణికం సదరు లబ్ధిదారుల వద్ద ప్రభుత్వ అగ్రిమెంట్లు పొజిషన్ సర్టిఫికెట్లు స్పష్టంగా ఉన్నాయి కాబట్టి వారు చట్టబద్ధమైన అనుభవదారులు వారికి పన్ను విధించే పూర్తి అధికారం మున్సిపాలిటీకి ఉంది

సేవల కొరకు పన్ను..! మున్సిపాలిటీ పరిధిలో సదరు ఇళ్ల ప్రజలు నివసిస్తూ వీధి దీపాలు తాగునీరు డ్రైనేజీ వంటి కనీస సదుపాయాలు పొందుతున్నప్పుడు మున్సిపాలిటీ ఆ సేవల నిమిత్తం ఖచ్చితంగా పన్ను వసూలు చేయాలి

పట్టా లేకపోవడం సాకు కాదు..! రాష్ట్రవ్యాప్తంగా వేలాది అక్రమ కట్టడాలకు, ఆక్రమిత స్థలాలకు కూడా మున్సిపాలిటీలు 'టాక్స్ అసెస్మెంట్' చేసి పన్నులు వసూలు చేస్తున్నాయి. అలాంటప్పుడు ప్రభుత్వం స్వయంగా కట్టించి, అగ్రిమెంట్లు ఇచ్చిన ఇళ్లకు పన్ను వేయకూడదనడం చట్టాన్ని ధిక్కరించడమే అవుతుంది. పన్ను రశీదు అనేది కేవలం టాక్స్ వసూలుకు మాత్రమే పరిమితం అని, అది యాజమాన్య హక్కును నిర్ధారించదని సుప్రీం కోర్టు తీర్పులు కూడా స్పష్టం చేస్తున్నాయి.

అధికారులు ఎందుకు తప్పించుకుంటున్నారు..!! ఇళ్లకు నంబర్లు ఇచ్చి పన్ను రశీదులు ఇస్తే సదరు పేద ప్రజలకు ఆ ఇళ్లపై పూర్తి స్థాయి చట్టపరమైన రికార్డు లభిస్తుంది. రేపు పొద్దున ఆ ఇళ్లను ఖాళీ చేయించడం ఎవరికీ సాధ్యం కాదు. బహుశా ఈ కారణంతోనే, లేదా క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే చేసే ఓపిక లేకపోవడం వల్లే మున్సిపల్ అధికారులు పట్టా ఉంటేనే పన్ను అనే చట్టవిరుద్ధమైన సాకులు చెబుతూ బాధితులను ఆఫీసుల చుట్టూ తిప్పుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారనే విమర్శలు..! ఒకపక్క రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల స్వయం సమృద్ధి కోసం ఆదాయ వనరులను పెంచుకోవాలని ఆదేశిస్తుంటే, ఆత్మకూరు మున్సిపల్ అధికారులు మాత్రం చేతికి వచ్చే లక్ష్మిని కాలదన్నుకుంటున్నారు. వందలాది ఇళ్లకు పన్నులు వేస్తే మున్సిపాలిటీకి ఏటా లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. ఇప్పటికైనా నంద్యాల జిల్లా కలెక్టర్ మరియు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అగ్రిమెంట్ ఇళ్లను తక్షణమే సర్వే చేసి టాక్స్ అసెస్మెంట్ చేయాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఓ అనాథ.... సోమయ్యకు శివం అంత్యక్రియలు

ఒంగోలు ఉష శ్రీ మే 18 :- పొట్టకూటి కోసం ఇస్త్రీ బండి నడుపుతున్న ఓ అనాధను వడదెబ్బ బలి తీసుకుంది .. అధిక ఉష్ణోగ్రతల వల్ల వడదెబ్బకు ఓ అనాధ మృతి చెందారు...బాపట్ల జిల్లా కర్లపాలెం గ్రామం కు చెందిన బాపట్ల సోమయ్య అనే వ్యక్తి గత 20 సంవత్సరాలుగా.. ఇస్త్రీ బండి నిర్వహించుకుంటూ ఒంగోలులో బండ్ల మిట్ట వద్ద దోవల పాలెం వినాయకుడి గుడి దగ్గర నివాసం ఉంటున్నాడు... సోమయ్యకు నా అని చెప్పుకునే వారు ఎవరూ లేరు.. మండే ఎండల తీవ్రత తట్టుకోలేక సోమయ్యకు వడదెబ్బ సోకి మృతి చెందాడని ఆ కాలనీవాసులు చెప్తున్నారు... సోమయ్యకు అంత్యక్రియలు నిర్వహించమని శివం పౌండేషన్ ఫౌండర్ గొల్లపూడి శ్రీహరి ఆశ్రయించారు... శ్రీహరి విశ్వహిందూ పరిషత్ వారి సహకారంతో సోమయ్య మృతదేహం కు కమ్మ పాలెం లోని స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు ...ఆర్ఎస్ఎస్ శేషారావు, పతంజలి యోగ బాలుజీ, విహెచ్పి రామానుజ పెరుమాళ్ళు , విశ్వహిందూ పరిషత్ నేరెళ్ల శ్రీనివాస రావు , సతీష్ కుమార్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం జిల్లా కలెక్టర్ ఫేస్‌బుక్ ఖాతా హ్యాక్

మార్కాపురం ఉష శ్రీ మే 18 :- మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం. విజయసునీత ఫేస్‌బుక్ ఖాతాను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసిన ఘటన కలకలం రేపింది. కలెక్టర్ ఖాతాను ఫాలో అవుతున్న వారికి నకిలీ సందేశాలు పంపుతూ మోసాలకు పాల్పడేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. విషయం గుర్తించిన కలెక్టర్ విజయసునీత వెంటనే అప్రమత్తమై హ్యాక్ అయిన ఖాతాను బ్లాక్ చేయించారు. అనంతరం కొత్త ఫేస్‌బుక్ ఖాతా ప్రారంభించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రజలు, అధికారులు పాత ఖాతా నుంచి వచ్చే సందేశాలను నమ్మవద్దని సూచించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఘటన మరోసారి ఆందోళన కలిగిస్తోంది. గతంలో మార్కాపురం పట్టణ ఎస్సై వాట్సాప్ ఖాతాను కూడా ఇదే తరహాలో సైబర్ కేటుగాళ్లు హ్యాక్ చేసిన విషయం తెలిసిందే. సోషల్ మీడియా ఖాతాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, సందేశాలకు స్పందించవద్దని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ఈ ప్రభుత్వ లక్ష్యం - మార్కాపురం శాసనసభ్యులు శ కందుల నారాయణ రెడ్డి

మార్కాపురం ఉష శ్రీ మే 18 :- మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్ లోని ప్రతి వార్డుకు వెళ్లి రోగుల కు వైద్య సహాయం ఏ విధంగా అందుతుందో అని ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ హాస్పిటల్లో కొంత వైద్య పరికరాల కొరత ఉన్న మాట వాస్తవమని వైద్యుల కొరత కూడా ఉందని ఈ మధ్యనే వైద్య విధాన పరిషత్ డైరెక్టర్ గారితో మాట్లాడమని త్వరలోనే ఈ హాస్పిటల్కు వైద్య సిబ్బంది సరిపడా వస్తారని మాట ఇచ్చారని అన్నారు. ఈ ఆసుపత్రిలో త్వరలోనే మరిన్ని సౌకర్యాలు కల్పించి ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తామని అన్నారు. వారి వెంట హాస్పిటల్స్ సిబ్బంది తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు

శ్రీశైల దేవస్థానం అఖిలభారత హిందూ ఫెడరేషన్ మండల అధ్యక్షుడిగా ఆరెపాటి కాశయ్య నియామకం

శ్రీశైల దేవస్థానం ఉష శ్రీ మే:18: విజయవాడ అఖిల భారత హిందూ ఫెడరేషన్ సాయి కృష్ణ ఫంక్షన్ హాల్ హనుమాన్ పేట కార్యాలయం నందు రాష్ట్ర కమిటీ మరియు జిల్లా కమిటీ ఎం. నాగేంద్ర రెడ్డి రాష్ట్ర కమిటీ పరిశీలికుడు మరియు డి.శంకర్ సమక్షంలో శ్రీశైలం దేవస్థానం నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షులుగా ఆరేపాటి కాశయ్య వైస్ ప్రెసిడెంట్ డి. సుధాకర్ సెక్రెటరీగా మైలపల్లి నాగరాజు కోశాధికారి డి. లక్ష్మీనారాయణ జాయింట్ సెక్రటరీ ఎం. రవికుమార్ ఎగ్జిక్యూటివ్ నెంబర్స్ జి.శంకర్ పి. వెంకటేశ్వర్లు జి. వెంకటేశ్వర్లు ఏ. విష్ణువర్ధన్ రెడ్డి డి. శివ ఎం. మల్లికార్జున రావు మరియు మహిళా విభాగం నూతన కమిటీ ఏర్పాటు కాబోతుంది దీనిలోని భాగంలో హిందూ కార్మిక సమైక్య కేవలం కార్మికుల ఉద్యోగ భద్రత కార్మిక చట్టాలు అమలు కోసం ఎండోమెంట్ యాక్ట్ అనుసరించి హిందువులకు న్యాయం జరిగే విధంగా దేవస్థానం నందు హిందువులకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా రాజకీయాలకు ఎటువంటి సంబంధం లేకుండా హిందువులకు న్యాయం జరిగే విధంగా ముందుకు సాగుతామని వారు మీడియాకు తెలిపారు

RNI NO: APTEL/25/A4894
ఉషశ్రీ USHASRI

ఉడత కిషోర్ కు ఘన నివాళి

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ : పామూరు మండల కేంద్రమైన కంబాలదిన్నె గ్రామపంచాయతీలోని తెలుగుదేశం పార్టీ మాజీ తెలుగు యువత అధ్యక్షులు ఉడత కిషోర్ ఇటీవల అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొందుతూ మరణించారు. తెలుగుదేశం పార్టీ విభిన్న ప్రతిభావంతుల ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, కంబాలదిన్నె గ్రామ పార్టీ అధ్యక్షులు మన్నం రమణయ్య, మోపాడు రిజర్వాయర్ చైర్మన్ చుంచు కొండయ్య, క్లస్టర్ ఇంచార్జ్ గుంటుపల్లి శ్రీనివాసులు, గోళ్ళ వీరాంజ నేయులు, ఉడత కిషోర్ పార్థివ దేహానికి తెలుగుదేశం పార్టీ జెండా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం నిర్వహించిన అంతిమ యాత్రలో తెలుగు యువత అధ్యక్షుడు రాయవరపు శ్రీకాంత్, పువ్వాడి వెంకటేశ్వర్లు (బెంగుళూరు బిల్డర్) ఏలూరి మాధవరావు, ఏలూరి నరసింహారావు, భారీగా ప్రజలు కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ వసతి గృహాలను సద్వినియోగం చేసుకోండి - వెల్ఫేర్ అసిస్టెంట్ రాచూరి ఏలియా

ఉష శ్రీ ఆర్ సి ఇంచార్జి కనిగిరి యాటా రాఘవేంద్ర. సోమవారం సిఎస్ పురం మండలం పెద్ద గోగులపల్లి ఎస్సీ కాలనీ నందు సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ డీడీ ఎన్ లక్ష్మా నాయక్ గారి ఆదేశాలు మేరకు అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా రాచూరి ఏలియా మాట్లాడుతూ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ హాస్టల్ బాగా అభివృద్ధి చేసి మంచి పౌష్టిక ఆహారం అందిస్తూ మంచి సదుపాయాలు కల్పిస్తుందని ఇక్కడ విద్య అభ్యసించిన విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారాని ఈ అవకాశం మీరు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు ఈకార్యక్రమంలో విద్యార్థుల తల్లి దండ్రులు రాజు తదితరులు పాల్గొన్నారు

16 ఏళ్లుగా బడి భవనానికి నోచుకోని గిరిజన గ్రామం

పోలవరంజిల్లా రంపచోడవరం ఉష శ్రీ ప్రతినిధి వెంకట్ దారవాడ, జూన్ 18:లి06.2026 పోలవరం జిల్లాలోని దారవాడ ఆదివాసీ గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం 16 సంవత్సరాలుగా పెండింగ్‌లో పడిందని, అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ దారవాడ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం, బడి భవనం కోసం గత 16 ఏళ్లుగా ఐటీడీఏ కార్యాలయం, వివిధ శాఖల అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఇప్పటివరకు మంజూరు కాలేదు. దీంతో ప్రస్తుతం ఉపాధ్యాయులు అర్ధ నిర్మాణంలో ఉన్న షెడ్లలోనే విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. వర్షాకాలంలో తరగతులు నిర్వహించడం కష్టంగా మారిందని వాపోయారు. "ఐటీడీఏ అధికారులు నిర్లక్ష్య వైఖరి వీడి దారవాడ గ్రామానికి స్కూల్ బిల్డింగ్ వెంటనే మంజూరు చేసి నిర్మించాలి. ఆదివాసీ ప్రాంతాల్లో విద్యా అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి" అని నిరసనకారులు డిమాండ్ చేశారు. బ్యానర్లు ప్రదర్శిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు.

పాత పద్ధతిలో ఉపాధి చట్టాన్ని కొనసాగింపు కై ఉద్యమించాలి వ్య.కా.సం జిల్లా అధ్యక్షులు కే మాల్యాద్రి పిలుపు...

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వి బి జి గ్రా మ్ గా మార్చి. పనిలో అనేక మార్పులు చేసి ఉపాధి కూలీల ఈ పని మాకొద్దు బాబోయ్ అనే విధంగా తయారు చేసిందని రెండు పూట ల పని ఫేస్ యాప్, సమ్మర్ అలవెన్స్, రాష్ట్ర ప్రభుత్వం 40% నిధులు కేటాయించాలని గడ్డపార సానా కు,తట్ట చార్జి, మజ్జిగ పంపిణీ లాంటి సౌకర్యాలు తగ్గించి కనీసం మంచినీళ్లు లేకుండా ఎర్రని ఎండలు కూలీలు పనిచేయాల్సి వస్తుందని కనీస సౌకర్యాలు కల్పించకుండా ఉపాధి కూలీలకు ఫేస్ యాప్ పనిచేయక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యవసాయ కార్మిక సంఘం మార్కాపురం జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి మాల్యాద్రి పామూరులో జరుగుతున్నా ఉపాధి పనులను పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పనులు పాత పద్ధతిలోనే కొనసాగింపుకై ఉద్యమాలు నిర్వహించాలని అందులో ఉపాధి కూలిలు భాగస్వాములు కావాలని ఉపాధి కూలీలకు 200 రోజులు పని దినాలు రోజు వేతనం 600 బడ్జెట్ లో రెండు లక్షల కోట్లు కేటాయించాలని ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాలపై రాజి లేని పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అలాగే పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు లేని పక్షశీలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు వీరనారాయణ ఉపాధి కూలీలు పాల్గొన్నారు

భీమిలిలో వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీ

- పెట్రోల్, డీజిల్ భారంపై మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)ఆయన కుమార్తె సిరమ్మ ఆగ్రహం
- రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్‌లి భీమిలిలో వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీ
- పెట్రోల్, డీజిల్ భారంపై మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)ఆయన కుమార్తె సిరమ్మ ఆగ్రహం

ఉష శ్రీ విజయనగరం మండల ప్రతినిధి భీమిలి 18 మే 26: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు భీమిలి నియోజకవర్గంలో భారీ నిరసన కార్యక్రమం సోమవారం జరిగింది. భీమిలి హెడ్ క్వార్టర్స్‌లోని నూకాలమ్మ స్టేజ్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), ఆయన కుమార్తె సిరమ్మ, నియోజకవర్గ పరిశీలకుడు తైనాల విజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని ర్యాలీని ముందుండి నడిపించారు. ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నడూ లేని విధంగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ధరలు తగ్గిస్తామని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు, నారా లోకేష్ అధికారంలోకి రాగానే ఆ హామీలను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ప్రజలకు ఉపశమనం కల్పించాల్సింది పోయి, 'బాదుడే బాదుడు' పాలనతో సామాన్యులపై మోయలేని భారాలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో లీటర్ పెట్రోల్ ధర రూ.113.62, డీజిల్ ధర రూ.101.24కు చేరడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం విపరీతంగా వ్యాట్ విధించడం వల్లే దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో పెట్రో ధరలు ఉన్నాయని స్పష్టం చేశారు. లీటర్ పెట్రోల్‌పై 31 శాతం వ్యాట్‌తో పాటు రూ.4 అదనపు పన్ను, మరో రూపాయి రోడ్ డెవలప్‌మెంట్ సెస్ రూపంలో వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. డీజిల్‌పై 22.25 శాతం వ్యాట్‌తో పాటు అదనపు భారం వేయడం వల్ల వాహనదారులు, రైతులు, రవాణా రంగం తీవ్రంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరల వల్ల రాష్ట్ర ప్రజలపై ఏడాదికి సుమారు రూ.3,391 కోట్ల అదనపు భారం పడుతుందని లెక్కలతో సహా వివరించారు. పెట్రోల్‌పై రోజుకు రూ.3.29 కోట్లు, డీజిల్ వల్ల రూ.6 కోట్ల మేర ప్రజల సొమ్ము కొల్లగొడుతున్నారని ధ్వజమెత్తారు. అంతర్జాతీయ మార్కెట్ సాకులు చెప్తూ ప్రజలను సైకిళు వాడాలని, కార్ పూలింగ్ చేసుకోవాలని కూటమి నాయకులు మాట్లాడటం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. ఎన్నికల హామీలను గాలికొదిలేసి ప్రజలను పీల్చిపిప్పి చేయడం చంద్రబాబు ద్వంద్వ వైఖరిని తెలియజేస్తోందని విమర్శించారు. ఈ భారీ నిరసన ర్యాలీలో భీమిలి నియోజకవర్గ పరిధిలోని మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, జిల్లా, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కమిటీల సభ్యులు, కార్పొరేటర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, మహిళా ప్రతినిధులు, వార్డు సచివాలయ కమిటీ అధ్యక్షులు, సోషల్ మీడియా కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధరలను తక్షణమే తగ్గించాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు భీమిలి నియోజకవర్గంలో భారీ నిరసన కార్యక్రమం సోమవారం జరిగింది. భీమిలి హెడ్ క్వార్టర్స్‌లోని నూకాలమ్మ స్టేజ్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), ఆయన కుమార్తె సిరమ్మ, నియోజకవర్గ పరిశీలకుడు తైనాల విజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని ర్యాలీని ముందుండి నడిపించారు. ఈ సం,దర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నడూ లేని విధంగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ధరలు తగ్గిస్తామని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు, నారా లోకేష్ అధికారంలోకి రాగానే ఆ హామీలను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ప్రజలకు ఉపశమనం కల్పించాల్సింది పోయి, 'బాదుడే బాదుడు' పాలనతో సామాన్యులపై మోయలేని భారాలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో లీటర్ పెట్రోల్ ధర రూ.113.62, డీజిల్ ధర రూ.101.24కు చేరడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం విపరీతంగా వ్యాట్ విధించడం వల్లే దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో పెట్రో ధరలు ఉన్నాయని స్పష్టం చేశారు. లీటర్ పెట్రోల్‌పై 31 శాతం వ్యాట్‌తో పాటు రూ.4 అదనపు పన్ను, మరో రూపాయి రోడ్ డెవలప్‌మెంట్ సెస్ రూపంలో వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. డీజిల్‌పై 22.25 శాతం వ్యాట్‌తో పాటు అదనపు భారం వేయడం వల్ల వాహనదారులు, రైతులు, రవాణా రంగం తీవ్రంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరల వల్ల రాష్ట్ర ప్రజలపై ఏడాదికి సుమారు రూ.3,391 కోట్ల అదనపు భారం పడుతుందని లెక్కలతో సహా వివరించారు. పెట్రోల్‌పై రోజుకు రూ.3.29 కోట్లు, డీజిల్ వల్ల రూ.6 కోట్ల మేర ప్రజల సొమ్ము కొల్లగొడుతున్నారని ధ్వజమెత్తారు. అంతర్జాతీయ మార్కెట్ సాకులు చెప్తూ ప్రజలను సైకిళు వాడాలని, కార్ పూలింగ్ చేసుకోవాలని కూటమి నాయకులు మాట్లాడటం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. ఎన్నికల హామీలను గాలికొదిలేసి ప్రజలను పీల్చిపిప్పి చేయడం చంద్రబాబు ద్వంద్వ వైఖరిని తెలియజేస్తోందని విమర్శించారు. ఈ భారీ నిరసన ర్యాలీలో భీమిలి నియోజకవర్గ పరిధిలోని మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, జిల్లా, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కమిటీల సభ్యులు, కార్పొరేటర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, మహిళా ప్రతినిధులు, వార్డు సచివాలయ కమిటీ అధ్యక్షులు, సోషల్ మీడియా కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మై టిడిపి యాప్ లో విశేష ప్రతిభ కనబరిచిన యువత

అడుసుమల్లి, పిడుగు, వాయినేని, హజరత్, పత్తు లను అభినందించిన ఎమ్మెల్యే డా" ఉగ్ర

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ : స్థానిక అమరావతి గ్రౌండ్ నందు నిర్వహించిన మై టిడిపి యాప్ లో విశేష ప్రతిభ కనబరిచిన యువతకు టాప్ టెన్ ర్యాంకర్లకు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి చేతుల మీదుగా బహుమతుల ప్రధానం కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో తెలుగుదేశం పార్టీని డిజిటల్‌గా మరింత బలోపేతం చేసేందుకు ' మై టిడిపి యాప్ ద్వారా విశేష ప్రతిభ కనబరిచిన యువతకు ఘన సత్కారం లభించింది. తెలుగు యువత నాయకులు దొడ్డ సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలో మైటీడీపి యాప్ వినియోగంలో అత్యుత్తమ ప్రదర్శనతో టాప్-10 ర్యాంకులు సాధించిన క్రియాశీలక సభ్యులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి విజేతలకు తన చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వ ప్రజాహిత కార్యక్రమాలను డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువత పాత్ర అత్యంత కీలకమని కొనియాడారు. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ మై టిడిపి (మైటీడీపి) యాప్ ద్వారా నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ టాప్-10 ర్యాంకులు సాధించిన యువతీ యువకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో యువత మరింత ఉత్సాహంతో పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తెలుగు యువత ప్రతినిధులు దొడ్డ సురేష్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ విభిన్న ప్రతిభావంతుల కార్యదర్శిఅడుసుమల్లి ప్రభాకర్ చౌదరి,చౌదరిఅచ్చాల రవి, మెంటా నరసింహారావు, పిడుగు శ్రీనివాసులు, వాయినేని రాఘవ, పత్తు మస్తాన్, చిన్న హజరత్ లను అలాగే యాప్‌లో చురుగ్గా పాల్గొన్న కార్యకర్తలను పార్టీ శ్రేణులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ బహుమతుల ప్రదానోత్సవంలో స్థానిక టిడిపి నాయకులు, తెలుగు యువత ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

మూగజీవాల ఆకలి తీర్చిన దాత గోశాలకు ట్రాక్టర్ వరిగడ్డి విరాళం.

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ నెల్లూరు జిల్లా వరికుంటపాడు శ్రీ పద్మావతి శ్రీ గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వైకుంటపురం గోశాలలోని గోవులకు రేణిమడుగు వాస్తవ్యులు మోడీ వెంకటేశ్వర్లు గోశాలలోని సుమారు 100 గోవులకు సరిపడ్డ వరిగడ్డిని మోపాడు బంగ్లా వాస్తవ్యులు మట్లే రాహుల్ యాదవ్ వారి ట్రాక్టర్ ద్వారా వరికుంటపాడు గోశాలకు తరలించారు. వరికుంటపాడు పరిసర ప్రాంతాలలో పశుగ్రాసానికి తీవ్ర ఇబ్బందులు ఉన్న నైపద్యంలో గోశాల నిర్వాహకులు చేసిన విజ్ఞప్తి మేరకు దాత మోడీ వెంకటేశ్వర్లు నిస్వార్థంగా గోవుల ఆకలి తీరుస్తున్న దాతల సేవలను గోశాల నిర్వాహకులు, గ్రామ పెద్దలు అభినందించారు. భవిష్యత్తులో నూ ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ మూగజీవాలకు సేవ చేయడం పుణ్య కార్యమని తమకు తోచిన సాయం చేశామని తెలిపారు.

విడాకులు తీసుకున్న భర్తకు మద్దతుగా హీరోయిన్లు!



కోలీవుడ్ హీరో జయం రవి భార్య ఆర్తి రవితో ఎదుర్కొంటున్న వైవాహిక వివాదం రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతోంది. తన విడాకుల ప్రక్రియ ముగిసే వరకు ఏ సినిమాలోనూ నటించనని సంచలన ప్రకటన చేశారు. తనపై బ్లాక్ మ్యాజిక్ ప్రయోగాలు జరిగాయని, మానసిక క్షోభతో రక్తం కూడా కక్కుకున్నానని ఆయన చేసిన ఆరోపణలు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలో రవికి తోటి సినీ ప్రముఖుల నుండి ఊహించని మద్దతు లభిస్తోంది. తాజాగా ప్రియాంక చోప్రా కజిన్ నటి మీరా చోప్రాతో పాటు సీనియర్ నటి అంబిక కూడా రవికి సపోర్ట్‌గా తమ అభిప్రాయాలను పంచుకున్నారు. –సౌత్ సినిమాల్లో పనిచేస్తున్నప్పటి నుండి నాకు జయం రవి తెలుసు. ఆయన ఎంతో మంచివాడు. నిరాడంబరుడు. ప్రస్తుతం ఆయన ఎదుర్కొంటున్న పరిస్థితులు చూశాక నేను చెప్పదలచుకున్నది ఒక్కటే. ప్రతిసారీ పురుషుడే తప్పు చేస్తాడనుకోవడం కరెక్ట్ కాదు. మహిళలకు అనుకూలంగా ఉన్న చట్టాలను కొంతమంది మహిళలు దుర్వినియోగం చేయడం నేను చాలా చోట్ల చూస్తున్నాను– అంటూ మీరా సంచలన వ్యాఖ్యలు చేశారు. న్యాయపోరాటంలో రవికి ఖచ్చితంగా న్యాయం దక్కుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే 80వ దశకంలో చిరంజీవి, రజనీకాంత్ వంటి అగ్ర హీరోలతో నటించిన సీనియర్ నటి అంబిక కూడా రవి పరిస్థితిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రెస్ మీట్‌లో రవిని అలా చూడటం తనకు చాలా బాధ కలిగించిందన్నారు. మానసిక ఒత్తిడి వల్ల రవి ముఖంలో కళ తప్పిందని, కళ్లలోనే ఆ బాధ కనిపిస్తోందని అంబిక పేర్కొన్నారు. రవి జీవితంలో ఈ నరకం త్వరలోనే ముగిసిపోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆయన సమస్యలను ఆయనే పరిష్కరించుకోగలరని ప్రస్తుతానికి సమాజం , మీడియా ఆయనను ఒంటరిగా వదిలేయడం మంచిదని సూచించారు. బాధకు ఆడ, మగ అనే తేడా ఉండదు. అది ఎవరికైనా ఒకేలా ఉంటుంది. ప్రస్తుతం ఎవరినీ విమర్శించడం లేదా ఒకరి వైపే మాట్లాడటం సరికాదు. అసలు విషయం ఏంటో పూర్తిగా తెలియకుండా కామెంట్లు చేయడం మానేసి వారి సమస్యలను వారే పరిష్కరించుకునేలా వదిలేయాలి అని అంబిక హితవు పలికారు. ఇద్దరు భాగస్వాములకు కూడా మంచి జరగాలని, దేవుడే వారికి సహాయం చేయాలని ప్రార్థించారు. మరోవైపు నిర్మాత సుజాత విజయ్‌కుమార్ కూడా స్పందించారు. రవి మోహన్ చేస్తున్న ఆరోపణలను తోసిపుచ్చారు. ఈ వివాదాల వల్ల తన మనవడు (రవి కుమారుడు) తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. రవి తన కుమారులను కలవడానికి కూడా ఆర్తి అనుమతించడం లేదనే ఆరోపణలు కూడా రావడంతో ఫ్యామిలీ డ్రామా ఇరు కుటుంబాల మధ్య పెద్ద యుద్ధానికే దారితీసినట్లు తెలుస్తోంది. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలు ప్రజాక్షేత్రంలోకి వచ్చినప్పుడు ఇండస్ట్రీ వర్గాలు కూడా ఎలా విడిపోతాయో? ఈ సంఘటన నిరూపిస్తోంది. ఒకప్పుడు ఆదర్శ దంపతులుగా ఉన్న రవి–ఆర్తిల వివాదం ఇప్పుడు చట్టపరమైన సవాళ్లు, వ్యక్తిగత ఆరోపణల మధ్య నలుగుతోంది. రాబోయే రోజుల్లో ఈ వివాదం ఎలాంటి మలుపులు తిరుగుతుందో? రవి మోహన్ మళ్లీ కెమెరా ముందుకు ఎప్పుడు వస్తారా? అన్నది కోలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మెరిసిన పాయల్ రాజ్‌పుత్

శక్తివంతమైన స్టూడియో ఫొటోలో పాయల్ రాజ్‌పుత్ తన ఆకర్షణతో అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది. రాయల్ బ్లూ రంగులో హాల్టర్ నెక్ జంప్‌సూట్ ధరించిన ఆమె, లోతైన నెక్ డిజైన్ మరియు కట్ అవుట్ స్టైల్‌తో మరింత గ్లామర్‌ను చాటింది. ఒక చేతిని నడుముపై ఉంచుకుని ధైర్యంగా కూర్చున్న భంగిమలో, స్థిరమైన చూపుతో ఆమె ఆత్మవిశ్వాసాన్ని వెలిబుచ్చింది. భూమి రంగు నేపథ్యంపై ఆమె అందం, శక్తి, నక్షత్ర కాంతి మరింత హైలైట్ అయింది. మెరుస్తున్న హీల్స్, మృదువైన అలలలా వాలిన జుట్టుతో ఆమె లుక్ పూర్తి అయింది. గ్లామర్, ధైర్యం కలిసిన ఈ స్టైల్‌లో పాయల్ ప్రత్యేకంగా కనిపించింది. "నీలంలో ధైర్యం... వెలుగులో వెలిగే వ్యక్తిత్వం" అన్న భావాన్ని ఈ ఫొటో అద్భుతంగా ప్రతిబింబిస్తోంది. పాయల్ 1992 డిసెంబర్ 5న న్యూ ఢిల్లీలో జన్మించింది. తెలుగు మరియు పంజాబీ చిత్రాలలో ప్రసిద్ధి చెందిన ఆమె, మొదట టెలివిజన్‌లో "సప్నోన్ సే భరే నైనా" అనే సీరియల్‌తో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. తరువాత పంజాబీ చిత్రం "చన్నా మేరేయా" ద్వారా సినీరంగంలో అడుగుపెట్టి, ఉత్తమ తొలి నటి అవార్డును అందుకుంది. తెలుగులో "ఆర్ ఎక్స్ 100" చిత్రంతో ఆమెకు విస్తృత గుర్తింపు వచ్చింది. "జిన్నా", "మంగళవారం", "శవా ని గిర్ధారి లాల్", "వీరే కి వెడ్డింగ్" వంటి చిత్రాలలో ఆమె నటన ప్రత్యేక గుర్తింపు పొందింది. విభిన్న పాత్రల్లో తన ప్రతిభను నిరూపించుకుంటూ, కమర్షియల్ మరియు ప్రాధాన్యత గల కథాంశాలతో కూడిన సినిమాల్లో సమతౌల్యం పాటిస్తూ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం తెలుగు, పంజాబీ చిత్రాలలో పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న పాయల్ రాజ్‌పుత్, దక్షిణ భారత సినీరంగంలో ప్రముఖ నటిగా కొనసాగుతోంది.

మరి నెక్స్ట్ ఏంటి?

- రష్మిక మందన్న ఈవెంట్ కామెంట్ వైరల్
- కృతి సనన్ అందంపై రష్మిక ప్రశంసలు
- ఎక్సైట్మెంట్‌లో అనుకోని పదం, వెంటనే సారీ
- వీడియో వైరల్, ఫ్యాన్స్–నెటిజన్ల మిక్స్ రియాక్షన్
- షాహిద్ కపూర్తో "కాక్‌టెయిల్ 2" పై హైప్

బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు వరుస విజయాలతో దూసుకెళ్తున్న నేషనల్ క్రష్ రష్మిక మందన్న మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారారు. సాధారణంగా ఎప్పుడూ హుందాగా, చిరునవ్వుతో కనిపించే రష్మిక.. తాజాగా ఓ ఈవెంట్ లో చేసిన కామెంట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఒక చిన్న ఎక్సైట్మెంట్ లో ఆమె చేసిన కామెంట్స్.. అభిమానులు, సినీ ప్రేక్షకుల మధ్య చర్చకు దారితీశాయి. ప్రస్తుతం పాన్ ఇండియా హీరోయిన్ గా బిజీగా ఉన్న రష్మిక చేతిలో తెలుగు, హిందీ భాషల్లో భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. ముఖ్యంగా బాలీవుడ్ లో ఆమె క్రేజ్ రోజు రోజుకూ పెరుగుతోంది. ఈ క్రమంలోనే ఆమె యాక్ట్ చేస్తున్న లేటెస్ట్ మూవీ కాక్ టెయిల్ 2 పై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. సినిమాలో షాహిద్ కపూర్, కృతి సనన్ తో కలిసి రష్మిక నటిస్తున్నారు. తాజాగా ఆ సినిమాకు సంబంధించిన సాంగ్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్ గా నిర్వహించారు. ఆ కార్యక్రమానికి మూవీ టీమ్ మొత్తం హాజరైంది. నిర్మాత దినేష్ విజన్, దర్శకుడు హోమీ అదజానియా, సంగీత దర్శకుడు ప్రీతమ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరోయిన్లు కృతి సనన్, రష్మిక స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచారు. ఆ ఈవెంట్ లో మాట్లాడిన రష్మిక.. తన కో హీరోయిన్ కృతి సనన్ అందాన్ని ప్రశంసిస్తూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. కాక్ టెయిల్ 2 లో కృతి చాలా హాలిట్ గా కనిపించిందని, అది ప్రపంచానికే తెలుసంటూ ఆమె చెప్పారు. అయితే మాట్లాడుతున్న సమయంలో ఎక్సైట్మెంట్ లో అనుకోకుండా ఒక అభ్యంతరకర పదం ఉపయోగించారు. వెంటనే తాను ఏమి మాట్లాడానో గ్రహించిన రష్మిక.. సారీ దాన్ని మ్యూట్ చేయండంటూ నవ్వేశారు. దీంతో అక్కడున్నవారంతా ఒక్కసారిగా నవ్వేశారు. ప్రేక్షకుల నుంచి కూడా పెద్ద ఎత్తున రెస్పాన్స్ వచ్చింది. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. కొందరు అభిమానులు మాత్రం రష్మికను సమర్థిస్తున్నారు. ఆమె చాలా నేచురల్ గా మాట్లాడుతుందని, ఎక్సైట్మెంట్ లో అలాంటి పొరపాట్లు జరుగుతాయంటూ కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు మాత్రం స్టార్ హీరోయిన్లు పబ్లిక్ ఈవెంట్లలో మాటల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని అభిప్రాయపడుతున్నారు. ఇటీవల కాలంలో బాలీవుడ్ లో వరుస అవకాశాలు దక్కించుకుంటున్న రష్మిక ఇమేజ్ కు ఆ వ్యాఖ్యలు కొంత మైనస్ అవుతాయా అనే చర్చ కూడా సాగుతోంది. ఇప్పటివరకు ఆమెపై పెద్దగా వివాదాలు లేకపోవడంతో ఆ ఘటన మరింత వైరల్ అయింది. అయితే ఇది పెద్ద విషయం కాదని, ఒక సరదా సందర్భంలో జరిగిన చిన్న పొరపాటు మాత్రమేనని ఆమె అభిమానులు చెబుతున్నారు. ఇక సినిమా విషయానికి వస్తే.. కాక్ టెయిల్ 2 జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. 2012లో విడుదలై మంచి విజయాన్ని అందుకున్న కాక్ టెయిల్ సినిమాకు ఇది సీక్వెల్ గా తెరకెక్కుతోంది. మొదటి భాగం యూత్ ను ఎంతగానో ఆకట్టుకోవడంతో, ఇప్పుడు రెండో పార్ట్ పై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే ఇప్పుడు రష్మిక ఏమైనా రెస్పాండ్ అయ్యి క్లారిటీ ఇస్తారేమో వేచి చూడాలి.

స్టార్ కుమార్తెను అయినా నాకేమీ రెడ్ కార్పెట్ వేయలేదు!

- సోనాక్షి సిన్హా: స్టార్ కిడ్స్‌కు సులువు అనేది అందరికీ కాదు
- శత్రుఘ్న సిన్హా: సిఫార్సులు చేయలేదు
- తన ప్రతిభను తానే నిరూపించుకోవాలని సూచన...
- తల్లిదండ్రుల పోలికల ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది
- దబాంగ్తో ఎంట్రీ, లూటేరాతో ప్రశంసలు

చిత్ర పరిశ్రమలో వారసత్వం అంశంపై కొన్ని సంవత్సరాలుగా పెద్ద ఎత్తున చర్చలు నడుస్తూనే ఉన్నాయి. స్టార్ కిడ్స్ కి ఇండస్ట్రీలోకి రావడం చాలా సులువని, వారికి ఎలాంటి కష్టం లేకుండానే అవకాశాలు దక్కుతాయనే విమర్శలు తరచూ వినిపిస్తునే ఉన్నాయి. అయితే ఈ భావన అందరి విషయంలోనూ నిజం కాదని బాలీవుడ్ స్టార్ నటి సోనాక్షి సిన్హా అంటున్నారు. తన కెరీర్ ఆరంభంలో తండ్రి, లెజెండరీ నటుడు శత్రుఘ్న సిన్హా పట్ల వ్యవహరించిన తీరును గుర్తుచేసుకుంటూ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఇండస్ట్రీలో సాధారణంగా కనిపించే నెపోటిజానికి భిన్నంగా తమ ఇంట్లో రివర్స్ నెపోటిజం వాతావరణం ఉండేదన్నారు. శత్రుఘ్న సిన్హా కుమార్తె అయినంత మాత్రాన తనకు ఇండస్ట్రీలో ఎవరూ రెడ్ కార్పెట్ పరచలేదని, పైగా తండ్రి ఇమేజ్ వల్ల తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. –నా కెరీర్‌ను ప్రారంభించినప్పుడు నా తండ్రి నాకు ఎటువంటి సిఫార్సులు చేయలేదు. చిత్ర పరిశ్రమలో నీకంటూ ఒక గుర్తింపు రావాలంటే నీ నైపుణ్యాన్ని నువ్వే స్వయంగా నిరూపించుకోవాలని స్పష్టంగా చెప్పారని సోనాక్షి గుర్తు చేసుకున్నారు. స్టార్ కిడ్స్ కి మొదటి సినిమా అవకాశం సులభంగానే దక్కినా? ఆ తర్వాత పరిశ్రమలో నిలదొక్కుకోవడానికి సాధారణ నటీనటుల కంటే ఎక్కువే కష్టపడాల్సి ఉంటుందని సోనాక్షి అభిప్రాయపడ్డారు. ఎందుకంటే ప్రేక్షకులు , విమర్శకులు నిరంతరం వారిని వారి తల్లిదండ్రుల ప్రతిభతో పోల్చి చూస్తుంటారు. ఆ భారీ అంచనాల ఒత్తిడిని తట్టుకుని, సొంత శైలిని అలవర్చుకోవడం పెద్ద సవాల్ అని పేర్కొన్నారు. తండ్రి చూపించిన కఠినమైన క్రమశిక్షణే తనను ఇండస్ట్రీలో స్వతంత్ర నటిగా ఎదగడానికి దోహదపడిందని సోనాక్షి కృతజ్ఞత భావాన్ని చాటుకున్నారు. సల్మాన్ ఖాన్ సరసన బ్లాక్‌బస్టర్ చిత్రం –దబాంగ్– తో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన సోనాక్షి సిన్హా? అటుపై కమర్షియల్ చిత్రాలతో పాటు –లూటేరా– వంటి పర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ సినిమాల్లో నటించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు.

PRINTED, PUBLISHED, OWNED BY ILIPILLA MOHAN, D.NO: 6-11-2, KILARI APPALASWAMI STREET, NAGA LAKSHMI NILYAM, ANJANEYAVAGUSENTAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH- 520001, PRINTED AT GANTYADA APPA RAO D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH-523001 P.H: 92950 03377,EMAIL: ushasri2025@gmail.com,RNI NO: APTEL/25/A4894,EDITOR: ILLIPILLA MOHAN